RNI NO .TGTEL/25/A4366

**తెలంగాణలో మీడియా అక్రెడిటేషన్‌కు కొత్త నిబంధనలు-2016 నాటి రూల్స్ రద్దు**




తెలంగాణ మీడియా అక్రెడిటేషన్ రూల్స్-2025'జారీ

3 లో

# తెలుగు గళం

సామాన్యుల గుండె చప్పుడు జాతీయ తెలుగు దినపత్రిక

**విలేకరులు కావలెను**

E69 NEWS ,తెలుగు గళం దినపత్రికలో పని చేయుటకు నియోజకవర్గాలవారీగా విలేకరులు కావలెను వాట్సాప్ నెం: 9959812941-9949356387

PUBLISHED: TELANGANA సంపుటి : 01 సంచిక :18 మంగళవారం 23 డిసెంబర్ 2025 ఎడిటర్: రాయపర్తి భాను ప్రసాద్ పేజీలు: 08 వెల :05/-


# అద్దె భవనాలకు చెక్..

## ప్రభుత్వానికి భారీ ఆదా లక్ష్యం

- ☑డిసెంబర్ 31 డెడ్‌లైన్ - జనవరి 1 నుంచి కొత్త నిబంధన అమలు
- ☑ప్రైవేటు అద్దె కొనసాగితే అధికారుల జేబుకే భారం
- ☑ఫిబ్రవరి 1 నుంచి అద్దె చెల్లింపులు నిలిపివేత
- ☑హైదరాబాద్‌లో ఖాళీగా ఉన్న ప్రభుత్వ భవనాల వినియోగం
- ☑పీఎస్‌యూలు, యూనివర్సిటీలు, సొసైటీలకూ వర్తించే ఆదేశాలు
- ☑ఒకే ప్రాంగణంలో ప్రజలకు అన్ని సేవలు అందే అవకాశం

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఖజానాపై పడుతున్న అదనపు భారాన్ని తగ్గించే దిశగా సంచలన నిర్ణయం తీసుకుంది. ఇకపై రాష్ట్రంలోని ఏ ప్రభుత్వ కార్యాలయం కూడా ప్రైవేటు అద్దె భవనాల్లో కొనసాగడానికి వీల్లేదని స్పష్టం చేసింది. ఈ మేరకు రాష్ట్ర ఆర్థిక శాఖ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కీలక ఆదేశాలు జారీ చేశారు. డిసెంబర్ 31వ తేదీని తుది గడువుగా నిర్ణయిస్తూ.. కొత్త ఏడాది నుంచి పరిపాలన అంతా సొంత భవనాల్లోనే సాగాలని ఆదేశించారు.

మిగతా 2 లో




**రాజకీయాలకు అతీతంగా అందుకు కృషి చేయండి..**

**మంత్రి దామోదర పిలుపు**




2 లో

**రాచకొండలో ఈ ఏడాది పెరిగిన నేరాలు**




2 లో

**మహిళలకు గుడ్ న్యూస్.. త్వరలో మరో కొత్త పథకం!**



2 లో

**అదానీ అంబానీ మైనింగ్ కోసమే ఉపాధి హామీ చట్టం రద్దు**

**సీతక్క సంచలన వ్యాఖ్యలు**



2 లో

**రాష్ట్రపతిని మేడారం మహాజాతరకు ఆహ్వానించిన రాష్ట్ర మంత్రులు**



2 లో

**దారి తప్పి బంగ్లాదేశ్ లోకి వెళ్లిన బిఎస్ఎఫ్ కానిస్టేబుల్.. సురక్షితం**



2 లో

**కులాంతర వివాహం.. కడుపుతో ఉన్న కన్న కూతుర్ని హత్య చేసిన తండ్రి**



2 లో

**అసెంబ్లీకి రమ్మంటే రావు.. మా తోలు తీస్తావా: మంత్రి పొన్నం**



2 లో

రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్ష నేతగా ఉండి అసెంబ్లీకి రమ్మంటే రారు.. కానీ మా తోలు తీస్తారా అంటూ కేసీఆర్ పై మంత్రి పొన్నం ప్రభాకర్ ఓ రేంజ్‌లో ఫైర్ అయ్యారు. సోమవారం ఆయన గాంధీ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. రెండేళ్ల తర్వాత ఫామ్‌హౌస్ నుంచి వచ్చి ఏది పడితే అది మాట్లాడతామంటే ఊరుకోమని అన్నారు.

**కేసీఆర్ వ్యాఖ్యలు 100 శాతం కరెక్ట్ ఏపీ మాజీ మంత్రి అమర్‌నాథ్**




2 లో

తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ఆదివారం మీడియాతో మాట్లాడిన విషయం తెలిసిందే. అయితే ఆయన ఆంధ్రప్రదేశ్‌తో పాటు ఉమ్మడి పాలనపై విమర్శలు చేశారు. ప్రస్తుత రాష్ట్ర సీఎం చంద్రబాబు గతంలో ఉమ్మడి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో జరిగిన కొన్ని ఘటనలను గుర్తు చేస్తూ కేసీఆర్ సెటైర్లు వేశారు. విశాఖలో జరిగిన సమ్మిట్లపైనా ఆయన ఛలోక్తులు విసిరారు.

## ఆ సభకు రాలేకపోయా.. చాలా బాధపడ్డా కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు



2 లో

శ్రీకాకుళం లో జరిగిన సభలో పాల్గొనలేక పోయాయని బాధపడ్డానని కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు అన్నారు. భీమవరం లో నిర్వహించిన అటల్ మోడీ సుపరిపాలన యాత్ర సభలో ఆయన ప్రసంగించారు. శ్రీకాకుళంలో సభ జరుగుతున్న సమయంలో సీఎం చంద్రబాబు ఢిల్లీలో ఉండటంతో తానూ అక్కడే ఉన్నానని తెలిపారు. తాను అనేకసార్లు భీమవరం రావాలని అనుకున్నా అవకాశం రాలేదని, అటువంటిది భీమవరంలో వాజ్ పేయ్ విగ్రహం ఆవిష్కరణలో పాల్గొనడం తన పూర్వజన్మ సుకృతమన్నారు. వాజ్ పేయ్‌ని స్ఫూర్తిగా తీసుకుని పని చేస్తున్నానని చెప్పారు. భీమవరానికి ప్రత్యేకత ఉందని, పట్టణంలో ఉండే సంపద ఉన్నా, పల్లెల్లో ఉండే ఆప్యాయత, ప్రేమ, అనురాగాలు ఉన్నాయన్నారు.

"ప్రధాని మోడీ ఆధ్వర్యంలో భారతదేశం నేడు ప్రపంచంలో ఉన్నత దేశంగా కీర్తింపపడుతుంది. భారతీయుడు అంటే... తలెత్తుకుని సెల్యూట్ చేసే పరిస్థితి మన దేశానికి మోడీ కల్పించారు.

## చొక్కాలు మార్చినంత ఈజీగా పార్టీలు మార్చాడు సీఎం రేవంత్ రెడ్డిపై హరీశ్‌రావు ఫైర్




2 లో

చొక్కాలు మార్చినంత ఈజీగా రేవంత్ రెడ్డి పార్టీలు మార్చాడని మాజీ మంత్రి హరీశ్ రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇవాళ ఆయన తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజల ప్రయోజనాల కోసమే నిన్న కేసీఆర్ మీడియా ముందుకు వచ్చి ప్రజలకు వాస్తవాలు చెప్పారని అన్నారు. బీఆర్ఎస్ హయాంలో ఆర్థిక అరాచకత్వం జరిగిందని రేవంత్ చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. సాక్షాత్తు ఇటీవల రేవంత్ ప్రభుత్వం నిర్వహించిన తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ వేదికగా కొత్త రాష్ట్రమైన తెలంగాణ అద్భుత ఆర్థిక ప్రగతి సాధించిందని టోనీ బ్లెయిర్, దువ్వూరి సుబ్బారావు ప్రశంసించడం నిజం కాదా అని ప్రశ్నించారు. కేసీఆర్ పాలన గురించి రేవంత్ రెడ్డి పిలిచిన అతిథులే పొగడటం రుచించలేదా అని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రం ఆర్థికంగా పరిపుష్టి సాధించిందని అన్నారు. జీఎస్‌డీపీ, తలసరి ఆదాయంలో దేశానికే తలమానికంగా తెలంగాణను నిలిపారని గుర్తు చేశారు.

# తమిళనాడులో పొలిటికల్ హీట్

## విజయ్ రాజకీయాలపై శరత్ కుమార్ కీలక వ్యాఖ్యలు!

అసెంబ్లీ ఎన్నికల దగ్గర పడుతుండడంతో తమిళనాడు రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. నటుడు, బీజేపీ నేత శరత్ కుమార్ అధికార డీఎంకే ప్రభుత్వంపై సంచలన వ్యాఖ్యలు చేస్తూ రాజకీయ ప్రకంపనలు స ృష్టించారు. మదురై తిరుప్పరంకుండ్రం కొండపై దీపం వెలిగించే అంశంలో జరుగుతున్న వివాదం పై ఆయన స్పందిస్తూ, రాష్ట్రంలో హిందువుల పరిస్థితిపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. "ప్రస్తుతం తమిళనాడులో హిందువులు తాము హిందువులమని చెప్పుకోవడానికి కూడా భయపడే పరిస్థితి నెలకొంది. హిందువులు 'హిందూ' అనే పదాన్నే మర్చిపోతున్నారు. మతపరమైన ఆచారాలను పాటించడంలో కూడా వివక్ష ఎదురవుతోంది" అని శరత్ కుమార్ మండిపడ్డారు. మదురై దీపం వివాదం విషయంలో ప్రభుత్వం అనుసరిస్తున్న తీరును ఆయన తప్పుబట్టారు.

అలాగే రాబోయే 2026 అసెంబ్లీ ఎన్నికలపై శరత్ కుమార్ తన ప్రణాళికను స్పష్టం చేశారు. "2026 ఎన్నికల్లో తాను స్వయంగా పోటీ చేయనని, క్షేత్రస్థాయిలో ఉండి బీజేపీ కూటమి గెలుపు కోసం ప్రచారం చేస్తానని స్పష్టం చేశారు. డీఎంకే ప్రభుత్వాన్ని గద్దె



దించడమే తన ప్రధాన లక్ష్యం" అని ప్రకటించారు. ఇదే సమయంలో కొత్తగా రాజకీయాల్లోకి వచ్చిన నటుడు విజయ్ గురించి మాట్లాడుతూ.. "నేను విజయ్‌ను ఒక రాజకీయ నాయకుడిగా చూడటం లేదు. రాజకీయాల్లో ఎవరికి ఏ బాధ్యతలు ఇవ్వాలి, ఎవరు మంచివారో, ఎవరు చెడ్డవారో కూడా ఆయనకు ఇంకా తెలియదు" అని వ్యాఖ్యానించారు. శరత్ కుమార్ చేసిన ఈ వ్యాఖ్యలు అటు డీఎంకే వర్గాల్లో, ఇటు విజయ్ అభిమానుల్లో చర్చనీయాంశంగా మారాయి. 2026 ఎన్నికలకు ముందే తమిళనాడులో సమీకరణాలు వేగంగా మారుతున్నాయని ఈ పరిణామాలు సూచిస్తున్నాయి.

## నేషనల్ హెరాల్డ్ కేసులో కీలక పరిణామం

**హైకోర్టును ఆశ్రయించిన ఈడీ**




2 లో

నేషనల్ హెరాల్డ్ మనీలాండరింగ్ కేసులో మరో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. కాంగ్రెస్ అగ్ర నేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీలతో పాటు ఇతరులపై రౌస్ అవెన్యూ ట్రయల్ కోర్టులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)చార్జ్‌షీట్ దాఖలు చేసింది. అయితే, ప్రైవేటు వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా పీఎంఎల్‌ఏ కింద చర్యలు తీసుకోవడం సాధ్యం కాదని కోర్టు అభిప్రాయపడింది. అదేవిధంగా కేసులో వేసిన ఛార్జ్‌షీటు కూడా చట్టపరంగా నిలవదని డిసెంబర్ 16న న్యాయమూర్తి ఆ పిటిషన్‌ను డిస్మిస్ చేశారు. ఈ క్రమంలోనే ట్రయల్ కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను సవాలు చేస్తూ ఈడీ అధికారులు ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

## అసెంబ్లీకి రమ్మంటే రావు.. మా తోలు తీస్తావా: కేసీఆర్‌కు మంత్రి పొన్నం కౌంటర్

మొదటి పేజీ తరువాయి

తాము ప్రజల చేత ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన వాళ్లమని అన్నారు. ప్రధాన ప్రతిపక్ష నేతగా గౌరవమిచ్చి శాసనసభకు రమ్మంటున్నామని.. సీఎం కూడా అదే చెప్పారని అన్నారు. అసెంబ్లీ స్పీకర్ కూడా పెద్దాయనకు ఏమాత్రం గౌరవం తగ్గకుండా సభను నడుపుదామని అన్నారని తెలిపారు. శాసనసభలో జరిగే చర్చతో రాష్ట్రానికి ఎవరు ఏం చేశారో ప్రజలే తేలుస్తారని అన్నారు.

కానీ, రాష్ట్రాన్ని అన్ని విధాలుగా భ్రష్టు పట్టించి.. మళ్లీ మా తోలు తీస్తామని అనడం పద్ధతి కాదన్నారు. ఖచ్చితంగా కాంగ్రెస్ పార్టీకి ప్రజల పట్ల, రాష్ట్రం పట్ల పూర్తి బాధ్యత ఉందన్నారు. రాష్ట్రం ఆర్థికంగా బలహీనంగా ఉన్న అన్ని శాఖలపై సీఎం, మంత్రులు ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తూ.. అన్ని సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నామని కామెంట్ చేశారు. సంక్షేమ హాస్టళ్లకు కిరాయిలు కట్టకపోతే.. తాళాలు వేసే పరిస్థితి నుంచి పాత మెస్ బకాయిలు కట్టకపోతే కట్టుకుంటూ వస్తున్నామని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం కట్టిన కాళేశ్వరం ఏమైందో తెలుసని.. కుర్చీ వేసుకుని కట్టిస్తానని చెప్పిన గౌరవెల్లి ప్రాజెక్టు ఏమైందో అందరికీ తెలుసని మంత్రి పొన్నం ప్రభాకర్ చురకలంటించారు.

## నేషనల్ హెరాల్డ్ కేసులో కీలక పరిణామం.. హైకోర్టును ఆశ్రయించిన ఈడీ

మొదటి పేజీ తరువాయి

అయితే, తాజాగా వేసిన ఈడీ ఛార్జ్‌షీటును ఢిల్లీ హైకోర్టు పరిగణలోకి తీసుకుని విచారణ చేపడుతుందా.. లేక ట్రయల్ కోర్టు మాదిరిగానే డిస్మిస్ చేస్తుందా అనేది హాట్ టాపిక్‌గా మారింది.

కాగా, సోనియా గాంధీ, రాహుల్ గాంధీ లు యంగ్ ఇండియన్ సంస్థలో 38 శాతం చొప్పున షేర్లు కలిగి ఉన్నారని ఈడీ ఆరోపించింది. ఏజేఎల్‌కు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన రూ.90.21 కోట్ల రుణాన్ని రూ.9.02 కోట్ల ఈక్విటీ షేర్లుగా మార్చి.. ఆ షేర్లను రూ.50 లక్షలకు యంగ్ ఇండియన్‌కు బదిలీ చేశారని పేర్కొంది. తద్వారా రూ.2 వేల కోట్ల నుండి రూ.5 వేల కోట్ల విలువైన ఏజేఎల్ ఆస్తులపై నియంత్రణ సాధించారని ఈడీ ఆరోపించింది. దీంతో ప్రివెన్షన్ ఆఫ్ మనీ లాండరింగ్ యాక్ట్ సెక్షన్లు 3, 4, మరియు 70 కింద వారిపై ఛార్జిషీటు దాఖలు చేశారు. ఏప్రిల్ 11, 2025న ఈడీ ఢిల్లీ, ముంబై, లక్నోలలో రూ.661 కోట్ల విలువైన ఏజేఎల్ ఆస్తులను సైతం ఆటాచ్ చేసిన విషయం తెలిసిందే.

## రాజకీయాలకు అతీతంగా అందుకు కృషి చేయండి.. నూతన సర్పంచ్‌లకు మంత్రి దామోదర పిలుపు

ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా రాజకీయాలకు అతీతంగా గ్రామాభివృద్ధే ధ్యేయంగా పనిచేయాలని నూతనంగా ఎన్నికైన సర్పంచ్?లు, ఉప సర్పంచ్‌లు గ్రామ వార్డు సభ్యులకు మంత్రి దామోదర రాజనర్సింహ పిలుపునిచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా నూతనంగా ఎన్నికై, నేడు ప్రమాణస్వీకారం చేసి బాధ్యతలు స్వీకరించిన నూతన గ్రామ పాలక కమిటీలకు మంత్రి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో గ్రామ పంచాయతీలే అత్యంత కీలకమైనవని, మహాత్మా గాంధీ కలలు కన్న 'గ్రామ స్వరాజ్యం' సాకారం కావడంలో స్థానిక ప్రజాప్రతినిధుల పాత్ర ఎంతో అమూల్యమని మంత్రి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గ్రామాల్లో ప్రజారోగ్య పరిరక్షణ బాధ్యత స్థానిక పాలకవర్గాలదేనని మంత్రి గుర్తుచేశారు. "మీ పదవీ కాలంలో గ్రామాల రోడ్లు, పరిశుభ్రత, పారిశుధ్యం, స్వచ్ఛమైన తాగునీటి సరఫరాపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి. తద్వారా సీజనల్ వ్యాధులను అరికట్టి, 'ఆరోగ్య తెలంగాణ' సాధనలో మీ వంతు సహకారం అందించాలని మంత్రి కోరారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి పేద కుటుంబానికి చేరేలా చూడాలని సూచించారు. దేశానికి తెలంగాణ పల్లెలు ఆదర్శ, ఆరోగ్య గ్రామాలుగా నిలవాలని మంత్రి ఆకాంక్షించారు.


## ఆ సభకు రాలేకపోయా.. చాలా బాధపడ్డా కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు

మొదటి పేజీ తరువాయి

మోడీ ఎంత కృషి చేసినా... ఆనాడు వాజ్ పేయ్ వేసిన పునాదే దీనికి నాంది అయ్యింది. ప్రజా స్వామ్యాన్ని కాపాడుకుంటూ.. ప్రజలకు నిరంతరం సేవ చేయడమే రాజకీయం అని ఆచరించి చూపిన నేత వాజ్ పేయ్. కాంగ్రెస్ యేతర ప్రధానిగా ఐదేళ్లు పాలన చేసిన వ్యక్తి వాజ్ పేయ్. 1999లో నేషనల్ ఫ్రంట్ ద్వారా అనేక పార్టీలను కలుపుకుని ప్రభుత్వాన్ని నడిపారు. వాజ్ పేయ్ వేసిన పునాదే.. నేడు ప్రాంతీయ పార్టీలకు ఊపిరి పోసింది. నేటి యువతరం కూడా వాజ్ పేయ్ గురించి తప్పకుండా తెలుసుకోవాలి." అని రామ్మోహన్ నాయుడు సూచించారు.

"13 రోజులు ప్రధానిగా చేసినా.. ఆ తర్వాత ఒక్క ఓటుతో పదవి పోతుందని చెప్పినా.. విలువలకు కట్టుబడి ఉన్నారు. నాకు అధికారం వద్దు.. ప్రజాస్వామ్యం గెలవాలని అని మాట్లాడిన వ్యక్తి వాజ్ పేయ్. నేటి రాజకీయాలతో చూడండి.. నేడు ఒక్క ఓటు కొనేందుకు కోట్లు కుమ్మరిస్తారు. ఎంపీలపై ఒత్తిడి తెచ్చి మద్దతు ఇచ్చేలా చేస్తారు. కానీ ఆనాడు వాజ్ పేయ్ ఎటువంటి తప్పుడు నిర్ణయాలు తీసుకోకుండా ప్రజాస్వామ్యానికి కట్టుబడి ఉన్నారు. చిన్న వయసులోనే జైలుకు వెళ్లారు. ఎన్నో ఇబ్బందులు పడి అంచలంచెలుగా ఎదిగి సుదీర్ఘ ప్రయాణం తర్వాత ప్రధానిగా అవకాశం వచ్చింది. 1999 -2004 మధ్య జాతీయ రహదారుల నిర్మాణం ద్వారా రాష్ట్రాలను కలిపారు. నగరాల నుంచి పల్లెల వరకు రైతుల వరకు మహిళల వరకు రోడ్లు వేయాలని గ్రామీణ సడక్ యోజన తీసుకు వచ్చారు. ఆరోజుల్లో అణుబాంబ్ శక్తిగా కావాలనుకుంటే.. అగ్రదేశాలు ఒత్తిడి చేశాయి. కరుణామయుడు లాంటి వాజ్ పేయ్.. ఒక కవి.. ఆనాడు ప్రపంచం మొత్తం ఒత్తిడి తెచ్చినా.. ధైర్యంగా నిలబడి మా దేశానికి ఏం కావాలో అదే చేస్తామన్నారు. ఎవరు ఎన్ని చెప్పినా.. అణుశక్తి దేశంగా భారతదేశాన్ని నిలిపారు." అని కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు.

## కులాంతర వివాహం.. కడుపుతో ఉన్న కన్న కూతుర్ని హత్య చేసిన తండ్రి



వేరే సామాజిక వర్గానికి చెందిన యువకుడిని ప్రేమించడమే కాకుండా ఆతడినే పెళ్లి చేసుకుందన్న కోపంతో ఓ తండ్రి దారుణానికి పాల్పడ్డాడు. గర్భిణీ అని కూడా కనికరం లేకుండా అత్యంత కిరాతకంగా హత్య చేశాడు. కర్నాటకలోని హుబ్బళ్లిలో జరిగిన ఈ దారుణ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. మాన్య పాటిల్ (19) అనే అమ్మాయి అదే గ్రామానికి చెందిన మరో సామాజిక వర్గానికి చెందిన వ్యక్తిని ప్రేమించి ఈ ఏడాది మేలో పెళ్లి చేసుకుంది. తన తల్లిదండ్రులకు ఇష్టానికి విరుద్ధంగా ఈ పెళ్లి చేసుకున్నందునా తన కుటుంబ సభ్యుల నుంచి తనకు ప్రాణ హాని ఉందని భయపడిన మాన్య పాటిల్ గ్రామానికి100 కిలోమీటర్ల దూరంలో హావేరి జిల్లాలో తన భర్తతో నివసిస్తోంది. పరిస్థితి అంతా సద్దుమణిగింది అనుకుని ఇటీవలే ఆమె తన స్వగ్రామానికి తిరిగి వచ్చింది.అయితే తన కూతురు విషయంలో లోలోపల రగిలిపోతున్న మాన్య తండ్రి ప్రకాశ్ ఫక్కిర్ గోడా ఆదివారం సాయంత్రం కూతురు భర్త కుటుంబంపై ఇనుప పైపులు ఇతర ఆయుధాలతో దాడికి దిగాడు. ఇంట్లోకి చొరబడి అత్యంత కిరాతకంగా దాడి చేశారు. ఈ ఘటనలో ఆరు నెలల గర్భవతి అయిన మాన్యను రక్షించేందుకు ఆమె అత్తమామలు ప్రయత్నించినా విఫలమయ్యారు. తీవ్ర గాయాలతో మాన్య ప్రాణాలు కోల్పోయింది. ఆమె అత్తమామలకు సైతం తీవ్ర గాయాలయ్యాయి. తండ్రికి భయపడి గ్రామానికి దూరంగా ఉన్న కూతురు చివరకు అదే తండ్రి చేతిలో చనిపోవడం గ్రామంలో విషాదం నింపింది. ఇక నిండు గర్భిణీ అనే కనికరం లేకుండా వ్యవహరించిన తీరు అందరిని కలిచి వేసింది. ఈ ఘనటలో పోలీసులు ముగ్గుర్ని అదుపులోకి తీసుకున్నారు.

## కేసీఆర్ వ్యాఖ్యలు 100 శాతం కరెక్ట్: ఏపీ మాజీ మంత్రి అమర్‌నాథ్

తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ఆదివారం మీడియాతో మాట్లాడిన విషయం తెలిసిందే. అయితే ఆయన ఆంధ్రప్రదేశ్‌తో పాటు ఉమ్మడి పాలనపై విమర్శలు చేశారు. ప్రస్తుత రాష్ట్ర సీఎం చంద్రబాబు గతంలో ఉమ్మడి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో జరిగిన కొన్ని ఘటనలను గుర్తు చేస్తూ కేసీఆర్ సెటైర్లు వేశారు. విశాఖలో జరిగిన సమ్మిట్లపైనా ఆయన ఛలోక్తులు విసిరారు.

అయితే కేసీఆర్ చేసిన ఈ వ్యాఖ్యలను మాజీ మంత్రి అమర్‌నాథ్ ఏకీభవించారు. వ్యక్తిగతంగా తాను సమర్థిస్తున్నట్లు మీడియా ముఖంగానే ఆయన స్పష్టం చేశారు. చంద్రబాబుపై కేసీఆర్ చేసిన విమర్శలు 100 శాతం కరెక్ట్ అని వ్యాఖ్యానించారు. పబ్లిసిటీ, మార్కెటింగ్, ప్రతిపక్షాలపై అన్యాయంగా కేసులు పెట్టడం వంటివి తప్ప చంద్రబాబు చేసిందేమీలేదన్నారు. కేసీఆర్ వ్యాఖ్యల్లో ఏ ఒక్క చిన్న తప్పు కూడా లేదనని వెల్లడించారు. ప్రతిపక్షాలను అణగతొక్కడం తప్ప, తనపై మితిమీరిన ప్రచారం చేసుకోవడం తప్ప, చంద్రబాబు చేస్తున్నది ఏమీ లేదని మాజీ మంత్రి గుడివాడ అమర్ నాథ్ విమర్శించారు.

## చొక్కాలు మార్చినంత ఈజీగా పార్టీలు మార్చాడు సీఎం రేవంత్ రెడ్డిపై హరీశ్‌రావు ఫైర్

మొదటి పేజీ తరువాయి

రాష్ట్రంలో మూడు రెట్లు జీఎస్‌డీపీ, తలసరి ఆదాయం పెరగడం వాస్తవం కదా అని హరీశ్ రావు అన్నారు. రాజకీయాల కోసం రాష్ట్రం పరువు తీయొద్దని సీఎం రేవంత్ రెడ్డికి హితవు పలికారు. సొంత పార్టీ నేతలనే తొక్కుకుంటూ పెరిగినట్లుగా రేవంత్ రెడ్డే చెప్పారని.. రూ.50 కోట్లు పెట్టి పీసీసీ చీఫ్ కొనుగోలు చేసినట్లుగా కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి బయట పెట్టాడని గుర్తు చేశారు. నిజాయితీగా త్యాగాల పునాదుల మీద ఎదిగిన నాయకత్వం తమదని.. పుట్టుక, చదువు, నౌకరీ ఒకే చోట చేస్తున్నారని, రేపు ఎక్కడో తెలియదంటూ సెటైర్లు వేశారు. ఎమ్మెల్యే, మంత్రి పదవులు గడ్డిపరకల్లా త్యాగం చేసింది బీఆర్ఎస్ నాయకులని.. చొక్కాలు మార్చినంత ఈజీగా పార్టీలు మార్చిన చరిత్ర రేవంత్ రెడ్డిది అని అన్నారు. కేసీఆర్ ప్రెస్‌మీట్ పెట్టగానే వెంటనే రేవంత్ రెడ్డి చిట్‌చాట్ పెట్టడం.. ఆయన ఎంత మరుగుజ్జు మనస్తత్వంతో ముఖ్యమంత్రిగా పనిచేస్తున్నాడో అర్థం అవుతుందని హరీష్ రావు ఫైర్ అయ్యారు.

## రాచకొండలో ఈ ఏడాది పెరిగిన నేరాలు 2025 క్రైమ్ వార్షిక నివేదికలో కీలక విషయాలు

రాచకొండ కమిషనరేట్ పరిధిలో గతేడాదితో పోలిస్తే ఈ సంవత్సరం నేరాల సంఖ్య పెరిగినట్లు రాచకొండ సీపీ సుధీర్ బాబు చెప్పారు. ఇవాళ రాచకొండ 2025 క్రైమ్ వార్షిక నివేదికను ఆయన వెల్లడించారు. కమిషనరేట్ పరిధిలో గత ఏడాది 28,626 కేసులు నమోదు కాగా, 2025లో 33,040 కేసులు నమోదు అయినట్లు చెప్పారు. దోపిడీ 3, దొంగతనాలు 67, ఇళ్లలో చోరీ 589 , వాహనాల చోరీలు 876 , సాధారణ చోరీలు 1, 161, హత్యలు 73 , అత్యాచారలు 330 , వరకట్నం చావులు 12, గృహ హింస కేసులు 782 నమోదైనట్లు వివరించారు. కిడ్నాప్ కేసులు, ఫోక్సో కేసులు సంఖ్య కూడా పెరిగిందని ఈ సంవత్సరం 579 కిడ్నాప్ కేసులు, 1224 ఫోక్సో కేసులు నమోదయ్యాయని, మర్డర్ ఫర్ గెయిన్ కేసులు 3 నమోదైనట్లు తెలిపారు.

మహిళలపై నేరాలు హైక్: గత ఏడాదితో పోలిస్తే మహిళ పై నేరాలు సంఖ్య 4 శాతం పెరిగిందని ఈఏడాది 20 కోట్లు విలువైన డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. డ్రగ్స్ కేసుల్లో 668 మంది నిందితులు అరెస్ట్ చేశామన్నారు. 256 డ్రగ్స్ కేసులు నమోదు చేసి ఇందులో 2090 కిలోల గంజాయి, 35 కిలోల గంజాయి చాక్లేట్లు, 34 కేజీల హ్యాష్ ఆయిల్, 216 గ్రాముల ఎండీఎంఏ , 10 కిలోల ఓపీఎస్, 242 గ్రాముల హెరాయిన్ , 35 కిలోల గసగసాల సామాగ్రి సీజ్ చేసినట్లు చెప్పారు.

పెరిగిన కన్విక్షన్ రేటు

ఎక్సైజ్ యాక్ట్ కింద 656 కేసులు నమోదు చేసి 689 మంది అరెస్ట్ చేశామన్నారు. 6824 లీటర్ల మద్యం సీజ్ చేసినట్లు తెలిపారు. గేమింగ్ యాక్ట్ కింద 227 కేసులు నమోదు చేసినట్టు తెలిపారు. 1,472 మంది అరెస్ట్ చేసి 69 లక్షల ప్రాపర్టీ సీజ్ చేశామన్నారు. మానవ అక్రమా రవాణా కింద ఈ ఏడాది 73 కేసులు నమోదు చేశామని 8 స్థావరాలు గుర్తించామన్నారు. ఈ ఏడాది 5, 647 కేసుల్లో 146 మందికి జైలు శిక్ష ఖరారైందని గత ఏడాది తో పోలిస్తే 74 శాతం కన్విక్షన్ రేటు పెరిగిందన్నారు. ఈ ఏడాది స్పెషల్ ఆపరేషన్ టీమ్ 186 డ్రగ్స్ కేసుల్లో 356 మంది అరెస్ట్ చేసిందని

తగ్గిన సైబర్ క్రైమ్ కేసులు

గత ఏడాదితో పోలిస్తే సైబర్ క్రైమ్ కేసులు తగ్గినట్లు సీపీ వెల్లడించారు. గత ఏడాది 4618 కేసులు నమోదు కాగా, ఈ ఏడాది 3734 కేసులు నమోదయ్యాయని, ఆపరేషన్ ముస్కాన్ కింద 2479 మంది ని రెస్క్యూ చేసినట్లు తెలిపారు. ఆపరేషన్ స్మైల్ 1071 మంది రెస్క్యూ చేశామన్నారు. గత ఏడాది తో పోలిస్తే ఈ ఏడాది రోడ్డు ప్రమాదాల సంఖ్య పెరిగిందని గత ఏడాది 3207 కేసులు నమోదు కాగా, ఈఏడాది 3488 కేసులు నమోదైనట్లు తెలిపారు. ఈ ఏడాది రోడ్డు ప్రమాదాల్లో 659 మందిమృతి చెందారని వివరించారు. కమిషనరేట్ పరిధిలోని ఓఆర్ఆర్ పై జరిగిన ప్రమాదాల్లో 37 మంది మృతి చేందారన్నారు.

## మహిళలకు గుడ్ న్యూస్.. త్వరలో మరో కొత్త పథకం!

తెలంగాణ ప్రభుత్వం మహిళలకు మరో గుడ్ న్యూస్ చెప్పనుంది. మహిళా సంఘాల ఆర్థిక సాధికారత లక్ష్యంగా ఇందిరా మహిళా శక్తి పథకం కింద విజయ డెయిరీ పార్లర్లను మహిళలకు కేటాయించేందుకు సిద్ధమైంది. ఈ పథకం ద్వారా మండలానికి ఒకటి చొప్పున, మున్సిపాలిటీల్లో రెండు చొప్పున మహిళా సంఘాలకు విజయ డెయిరీ పార్లర్లు కేటాయించేలా అధికారులు ప్రణాళిక రచిస్తున్నట్టు సమాచారం. దీనిపై వారం పది రోజుల్లో విధివిధానాలను ఖరారు చేయనున్నారు. పార్లర్ కోసం మహిళా సంఘాలు పారిశ్రామికాభివృద్ధి సహకార సమాఖ్యకు రూ.1,000 చెల్లించి దరఖాస్తు చేసుకోవాల్సి ఉండగా, స్థలం ఏర్పాటు అనంతరం రూ.5,000 చెల్లిస్తే పార్లర్ మంజూరు చేస్తారు.

ఒక్కో పార్లర్ ఏర్పాటుకు సుమారు రూ.5 లక్షల వరకు ఖర్చు అవుతుండగా, దీనికోసం ప్రభుత్వం లోన్లను అందించనుంది. అయితే ఈ పార్లర్లలో విజయ డెయిరీ ఉత్పత్తులైన పాలు, పెరుగు, పన్నీర్, వాటర్ బాటిళ్లు మాత్రమే అమ్మాల్సి ఉంటుంది. ఈ విక్రయాల ద్వారా వచ్చే ఆదాయం మహిళల ఆర్థికాభివృద్ధికి దోహదపడుతుందని ప్రభుత్వం భావిస్తోంది. ఇప్పటికే ఆర్టీసీ బస్సులు, పెట్రోల్ బంకులు, మహిళా శక్తి క్యాంటీన్లు వంటి కార్యక్రమాల ద్వారా మహిళా సంఘాలను బలోపేతం చేస్తూ వచ్చిన ప్రభుత్వం.. ఈ డెయిరీ పార్లర్ల కేటాయింపుతో వారి జీవనోపాధి అవకాశాలను మరింత పెంచనుంది.

## రాష్ట్రపతిని మేడారం మహాజాతరకు ఆహ్వానించిన రాష్ట్ర మంత్రులు

ఆసియా ఖండంలోనే అతిపెద్ద గిరిజన జాతరగా పేరొందిన శ్రీ మేడారం సమ్మక్క సారమ్మ మహాజాతర వచ్చే సంవత్సరం జనవరి 28 నుంచి 31వ తేదీ వరకు జరగనున్నదని, ఈ జాతరకు రాష్ట్రపతి హోదాలో అమ్మవార్లను దర్శించుకోవాలని రాష్ట్ర మంత్రులు దనసరి అనసూయ (సీతక్క), కొండా సురేఖ, అట్లూరు లక్ష్మణ్ కుమార్ రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కోరారు. బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో రాష్ట్రపతికి అధికారిక ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా మేడారం మహాజాతర సంప్రదాయాలకు అనుగుణంగా, సమ్మక్క తల్లి చీర, కంకణం, కండువా బంగారాన్ని రాష్ట్రపతికి అందచేశారు. అనంతరం మంత్రి సీతక్క మేడారం జాతర ఘనత, ఆదివాసీ సంస్కృతిలో దాని అపూర్వ స్థానం, సమ్మక్క సారలమ్మ తల్లుల పోరాట చరిత్ర, వారి త్యాగం, ప్రజల విశ్వాసం, భక్తి, మేడారం అభివృద్ధి పనులు, జాతర నిర్వహణ ఏర్పాట్లను రాష్ట్రపతి వివరించారు. మేడారం జాతర విశేషాలను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అత్యంత ఆసక్తితో విని, ఈ మహా జాతరకు హాజరయ్యేందుకు కచ్చితంగా ప్రయత్నిస్తానని తెలిపారు. రాష్ట్రపతి మంత్రులకు ఆప్యాయంగా నూతన వస్త్రాలను బహూకరించి ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషిని రాష్ట్రపతి అభినందించారు.

## అదానీ అంబానీ మైనింగ్ కోసమే ఉపాధి హామీ చట్టం రద్దు సీతక్క సంచలన వ్యాఖ్యలు



ఉపాధి హామీ చట్టం స్థానంలో కేంద్ర ప్రభుత్వం వీబీ-జీ రామ్ జీ చట్టాన్ని తీసుకురావడం పట్ల మంత్రి సీతక్క తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉపాధి హామీ చట్టానికి గాంధీ పేరు తీసేసి గాంధీని మరోసారి బీజేపీ హత్య చేసిందని, మళ్ళీ వెట్టి చాకిరి విధానాన్ని తేవాలని బీజేపీ ఆలోచిస్తోందని ఆరోపించారు. ఇవాళ గాంధీ భవన్ లో మీడియాతో మాట్లాడిన సీతక్క అదానీ అంబానీ మైనింగ్ తవ్వకాలకు కూలీలను సరఫరా చేసేందుకు ఉపాధి హామీ చట్టం రద్దు చేశారని ధ్వజమెత్తారు. ఉపాధి హామీ చట్టాన్ని రక్షించుకునే బాధ్యత మనందరిదని ఉపాధి హామీ పథకాన్ని కాపాడాలని గ్రామాల్లో తీర్మానాలు చేసి కేంద్రానికి పంపిస్తామన్నారు. 27 లేదా 28 తేదీల్లో ర్యాలీలు నిర్వహిస్తామన్నారు. వలసలు తగ్గించేందుకు, వెట్టి చాకిరి నుండి విముక్తి కోసం గత యూపీఏ ప్రభుత్వం జాతీయ ఉపాధి హామీ చట్టం తెస్తే ప్రస్తుత బీజేపీ ప్రభుత్వం ఉపాధిహామీ చట్టానికి ఉరేసిందని ఆరోపించారు. ఉపాధి హామీ పథకంలో కేంద్రం ప్రతి సంవత్సరం పని దినాలను తగ్గిస్తూ వస్తోంది. సొంత ఊర్లో పని హక్కు లేకుండా బీజేపీ చేస్తోందన్నారు. ఉపాధి చట్టాన్ని రద్దు చేస్తే గ్రామాల్లో కూలీలకు పని ఉండదని ఆ కూలీలు తక్కువ కూలికే కార్పొరేట్లకు లభిస్తారన్నారు. కేంద్ర ప్రభుత్వ కుట్రలను అందరూ తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. కేంద్రం బిక్షగా కాకుండా ఉపాధి హక్కుగా లభించే విధంగా ఉన్న ఉపాధి హామీ చట్టాన్ని అందరూ కాపాడుకోవాలన్నారు.

బాధ్యతాయుతంగా పనిచేయండి:

గ్రామ ప్రజాస్వామ్యానికి బలం చేకూర్చే విధంగా ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపొంది నేడు పదవి బాధ్యతలు చేపట్టిన నూతన సర్పంచులు, వార్డు సభ్యులకు పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి సీతక్క శుభాకాంక్షలు తెలిపారు. ప్రజల నమ్మకంతో ఎన్నికైన ప్రజాప్రతినిధులు గ్రామాభివృద్ధి, ప్రజా సంక్షేమం, పారదర్శక పాలన దిశగా బాధ్యతాయుతంగా పనిచేయాలని మంత్రి సీతక్క ఆకాంక్షించారు. గ్రామాలే రాష్ట్ర అభివృద్ధికి పునాది అని పేర్కొన్న మంత్రి..సర్పంచులు వార్డు సభ్యులు సమిష్టిగా పనిచేస్తేనే పల్లె ప్రగతి సాధ్యమవుతుందనీ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని పరిష్కార మార్గాలు చూపే నాయకత్వం అందించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి పూర్తి స్థాయిలో సహకరిస్తుందని, ప్రజాప్రతినిధులు ధైర్యంగా ముందుకు సాగాలని మంత్రి సీతక్క భరోసా ఇచ్చారు.

## దారి తప్పి బంగ్లాదేశ్ లోకి వెళ్లిన బిఎస్ఎఫ్ కానిస్టేబుల్.. సురక్షితం




పశ్చిమ బెంగాల్‌లోని కూచ్ బెహార్ జిల్లాలో భారత్-బంగ్లాదేశ్ సరిహద్దు వద్ద పశువుల స్మగ్లర్లను వెంబడిస్తూ బిఎస్ఎఫ్ కానిస్టేబుల్ తప్పిపోయిన విషయం తెలిసిందే. అయితే ఆ రోజు ఆ జవాన్ సురక్షితంగా భారతదేశానికి తిరిగి వచ్చారు. బిఎస్ఎఫ్ 174వ బెటాలియన్‌కు చెందిన కానిస్టేబుల్ వేద్ ప్రకాష్, ఆదివారం తెల్లవారుజామున స్మగ్లింగ్ ప్రయత్నాన్ని అడ్డుకునే క్రమంలో పొరపాటున అంతర్జాతీయ సరిహద్దు దాటి బంగ్లాదేశ్ భూభాగంలోకి ప్రవేశించారు. ఆ సమయంలో సరిహద్దు ప్రాంతంలో దట్టమైన పొగమంచు కురుస్తుండటంతో కనుచూపు మేర ఏమీ కనిపించకపోవడమే ఈ పొరపాటుకు ప్రధాన కారణమని అధికారులు వెల్లడించారు.

కానిస్టేబుల్ బంగ్లాదేశ్ భూభాగంలోకి రాగానే అక్కడి సరిహద్దు బలగాలు ఆయనను అదుపులోకి తీసుకున్నాయి. ఈ విషయాన్ని గుర్తించిన బిఎస్ఎఫ్ ఉన్నతాధికారులు వెంటనే బంగ్లాదేశ్ అధికారులతో సంప్రదింపులు జరిపారు. అనంతరం ఆదివారం మధ్యాహ్నం తీన్ బిఘా కారిడార్ వద్ద ఇరు దేశాల భద్రతా బలగాల మధ్య జరిగిన 'ఫ్లాగ్ మీటింగ్' తర్వాత కానిస్టేబుల్‌ను బిజిబి అధికారులు క్షేమంగా బిఎస్ఎఫ్‌కు అప్పగించారు. వాతావరణ పరిస్థితుల వల్ల జరిగిన ఈ పొరపాటును అర్థం చేసుకున్న అధికారులు, ఎటువంటి ఉద్రిక్తతలు లేకుండా ఈ సమస్యను పరిష్కరించారు.

## అద్దె భవనాలకు చెక్.. ప్రభుత్వానికి భారీ ఆదా లక్ష్యం

మొదటి పేజీ తరువాయి

ప్రభుత్వ నిర్ణయం కేవలం ఆదేశాలకే పరిమితం కాకుండా.. కఠినమైన ఆర్థిక నిబంధనలను కూడా విధిస్తోంది. డిసెంబర్ 31 లోపు ప్రైవేటు భవనాలను ఖాళీ చేసి.. అందుబాటులో ఉన్న ప్రభుత్వ కార్యాలయాల్లోకి మారాలి. ఫిబ్రవరి 1 నుంచి ప్రైవేటు భవనాలకు అద్దె చెల్లింపులను నిలిపివేయాలని ట్రెజరీ విభాగానికి సర్క్యులర్ జారీ అయింది. గడువు దాటిన తర్వాత కూడా అద్దె భవనాల్లోనే కొనసాగితే... ఆ అద్దెను సంబంధిత శాఖాధికారి తన వ్యక్తిగత ఖాతా నుంచి చెల్లించాల్సి ఉంటుంది.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన తర్వాత హైదరాబాద్ నగరంలో తెలంగాణ ప్రభుత్వానికి భారీగా భవన సదుపాయాలు అందుబాటులోకి వచ్చాయి. గత పదేళ్లలో ఆంధ్రప్రదేశ్ తన కార్యాలయాలన్నింటినీ అమరావతి, విజయవాడకు తరలించడంతో రాజధానిలో కీలకమైన భవనాలు ఖాళీ అయ్యాయి. ప్రస్తుతం పరిశ్రమ భవన్, గగన్ విహార్ కాంప్లెక్స్, బీఆర్కే భవన్ , ఎర్రమ్ మంజిల్ వంటి ప్రతిష్టాత్మక భవనాల్లో తగినంత స్థలం అందుబాటులో ఉంది. ప్రభుత్వ విభాగాలే కాకుండా, ప్రభుత్వ రంగ సంస్థలు, విశ్వవిద్యాలయాలు, సొసైటీలు కూడా ఈ నిబంధనను పాటించాల్సి ఉంటుంది.

ప్రతి ఏటా ప్రభుత్వం అద్దె రూపంలో కోట్లాది రూపాయలను ప్రైవేటు భవన యజమానులకు చెల్లిస్తోంది. ఈ నిర్ణయం వల్ల ప్రభుత్వ ఆదాయం వృధా కాకుండా కాపాడవచ్చు. సొంత భవనాలు ఖాళీగా ఉండగా.. అద్దె భవనాల కోసం ప్రజా ధనాన్ని వెచ్చించడం సరికాదని ప్రభుత్వం భావిస్తోంది అన్ని కార్యాలయాలు ప్రభుత్వ భవనాల్లోకి మారడం వల్ల ప్రజలకు కూడా ఒకే ప్రాంగణంలో వివిధ సేవలందే అవకాశం ఉంటుంది.

అన్ని శాఖల ప్రత్యేక కార్యదర్శులు, విభాగాధిపతులు వెంటనే తమకు అనువైన ప్రభుత్వ స్థలాలను పరిశీలించి.. బదిలీ ప్రక్రియను పూర్తి చేయాలని సీఎస్ కె.రామకృష్ణారావు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. జనవరి 1 నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఏ ఒక్క ప్రభుత్వ బోర్డు కూడా ప్రైవేటు భవనంపై కనిపించకూడదన్నది ప్రభుత్వ ప్రధాన లక్ష్యంగా కనపడుతోంది.

## కారు బాంబు పేలుడులో రష్యన్ జనరల్ మృతి



రష్యా రాజధాని మాస్కోలో కారు బాంబు పేలుడు ఘటన జరిగింది. ఆ పేలుడు ఘటనలో రష్యన్ జనరల్ మృతిచెందినట్లు అధికారులు పేర్కొన్నారు. నగరంలోని దక్షిణ ప్రాంతంలో జరిగిన పేలుడు వల్ల భారీ సంఖ్యలో వాహనాలు దెబ్బతిన్నాయి. కారు డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. పేలుడు ప్రమాదంలో మృతిచెందిన బాధిత వ్యక్తిని లెఫ్టినెంట్ జనరల్ ఫానిల్ సర్వరోవ్‌గా గుర్తించారు. జనరల్ స్టాఫ్ ఆపరేషనల్ ట్రైనింగ్ విభాగంలో ఆయన చీఫ్‌గా వ్యవహరిస్తున్నారు. అయితే వాహనం కింద భాగంగా పేలుడు పదార్థాన్ని అమర్చినట్లు అధికారులు చెప్పారు. ఉక్రెయిన్ ఇంటెలిజెన్స్ సర్వీసు ఆ పేలుడుకు పాల్పడి ఉంటుందని రష్యన్ అధికారులు అంచనా వేస్తున్నారు. లెఫ్టినెంట్ జనరల్ సర్వరోవ్ వయసు 56 ఏళ్లు. సీనియర్ ఆఫీసర్ల శిక్షణ విభాగం బాధ్యతలను ఆయనకు 2016లో అప్పగించారు. గతంలో ఆయన రష్యా దళాల తరపున సిరియాలో పనిచేశారు.

## తెలంగాణలో మీడియా అక్రెడిటేషన్‌కు కొత్త నిబంధనలు-2016 నాటి రూల్స్ రద్దు


### తెలంగాణ మీడియా అక్రెడిటేషన్ రూల్స్-2025'జారీ




తెలుగు గళం న్యూస్ హైదరాబాద్: రాష్ట్రంలోని జర్నలిస్టులకు జారీ చేసే మీడియా అక్రెడిటేషన్ కార్డుల విషయంలో తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది.2016 నాటి పాత నిబంధనలను రద్దు చేస్తూ,'తెలంగాణ మీడియా అక్రెడిటేషన్ రూల్స్-2025'ను అమల్లోకి తీసుకువస్తూ ప్రభుత్వం జీఓఎంఎస్ నెం.252ను విడుదల చేసింది.ఈ కొత్త నిబంధనలతో అక్రెడిటేషన్ ప్రక్రియ మరింత పారదర్శకంగా,క్రమబద్ధంగా ఉండేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది.కమిటీలకు రెండేళ్ల పదవీ కాలం రాష్ట్ర స్థాయి మీడియా అక్రెడిటేషన్ కమిటీ,జిల్లా స్థాయి మీడియా అక్రెడిటేషన్ కమిటీల పదవీ కాలాన్ని రెండేళ్లుగా నిర్ణయించారు.కొత్త కమిటీలు ఏర్పడే వరకు ప్రస్తుత కమిటీలే కొనసాగుతాయి.అక్రెడిటేషన్ కార్డు-మీడియా కార్డు వేర్వేరు రిపోర్టర్లకు ప్రభుత్వ సమాచారాన్ని సేకరించేందుకు అక్రెడిటేషన్ కార్డు జారీ చేయనున్నారు.డెస్క్ జర్నలిస్టులకు ఇచ్చే మీడియా కార్డు మాత్రం ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాల కోసం మాత్రమే ఉపయోగపడుతుంది. డిజిటల్ మీడియాకు తొలిసారి నిబంధనలు డిజిటల్ న్యూస్ మీడియాకు తొలిసారిగా ప్రత్యేక నిబంధనలు తీసుకొచ్చారు. అక్రెడిటేషన్ పొందాలంటే సంబంధిత వెబ్‌సైట్‌కు గత ఆరు నెలల్లో నెలకు కనీసం 5 లక్షల యూనిక్ విజిటర్లు ఉండాలి.రాష్ట్రవ్యాప్తంగా డిజిటల్ మీడియా విభాగంలో గరిష్టంగా 10 అక్రెడిటేషన్ కార్డులు మాత్రమే జారీ చేస్తారు.ఎలిజిబిలిటీ క్రైటీరియా న్యూస్ పేపర్లకు కనీసం 2 వేల ప్రతుల పంపిణీ ఉండాలి.పీఆర్‌జీఐ రిజిస్ట్రేషన్ తప్పనిసరి.ఎలక్ట్రానిక్ మీడియా ఛానళ్లు కనీసం 50 శాతం వార్తా కంటెంట్ ప్రసారం చేయాలి.లోకల్ కేబుల్ ఛానళ్లు రోజుకు కనీసం మూడు వార్తా బులెటిన్లు టెలికాస్ట్ చేయాలి.స్టేట్ లెవల్ అక్రెడిటేషన్‌కు డిగ్రీ లేదా ఐదేళ్ల అనుభవం అవసరం. నియోజకవర్గ,మండల స్థాయి రిపోర్టర్లకు ఇంటర్మీడియట్ విద్యార్హత తప్పనిసరి.ఫ్రీలాన్స్, వెటరన్ జర్నలిస్టులకు అవకాశం 15 ఏళ్ల అనుభవం ఉన్న ఫ్రీలాన్స్ జర్నలిస్టులు,30 ఏళ్ల అనుభవంతో పాటు 58 ఏళ్లు నిండిన వెటరన్ జర్నలిస్టులు కూడా అక్రెడిటేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవచ్చు.కమిటీల నిర్మాణం రాష్ట్ర కమిటీలో మీడియా అకాడమీ చైర్మన్ చైర్మన్‌గా,సమాచార-ప్రజాసంబంధాల కమిషనర్ కో-చైర్మన్‌గా వ్యవహరిస్తారు.జిల్లా కమిటీలో జిల్లా కలెక్టర్ చైర్మన్‌గా,డీపీఆర్వో మెంబర్ కన్వీనర్‌గా ఉంటారు.నిబంధనల ఉల్లంఘనకు చర్యలు అక్రెడిటేషన్ కార్డులను దుర్వినియోగం చేసినా,తప్పుడు సమాచారం ఇచ్చినా కార్డులను రద్దు చేసే అధికారం ప్రభుత్వానికి ఉంటుంది.పోగొట్టుకున్న కార్డు స్థానంలో డూప్లికేట్ కార్డు పొందేందుకు రూ.250 చెల్లించాలి.

## ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేసి నిర్దిష్ట గడువులోగా పూర్తి చేయాలి

### రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి





తెలుగు గళం న్యూస్ జనగామ: రాష్ట్రవ్యాప్తంగా ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు.సోమవారం హైదరాబాదు నుండి ఇతర ఎన్నికల అధికారులతో కలిసి వీడియో సమావేశం ద్వారా అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు,జిల్లా కలెక్టర్లు,ఎన్నికల నమోదు అధికారులు,సహాయ ఎన్నికల నమోదు అధికారులతో ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియపై సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియను అత్యంత ప్రాధాన్యంగా తీసుకుని ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు.ప్రత్యేక సాంద్రత పునఃపరిశీలన (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) దృష్ట్యా మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు.పట్టణ ప్రాంతాల్లో రోజుకు కనీసం 10 వేల ఓటర్ల మ్యాపింగ్ చేపట్టి,నిర్ణీత గడువులోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.వచ్చే వారంలోగా మ్యాపింగ్ ప్రక్రియలో గణనీయమైన పురోగతి నమోదు కావాలని ఆదేశించారు.అలాగే ఓటర్ల జాబితాలో ఉన్న మసకబారిన ఫోటోలు,చిన్న పరిమాణ ఫోటోలు,సరైనవి కాని ఫోటోలను గుర్తించి,ఫారం-8 ద్వారా అసలైన ఫోటోలను సేకరించి జాబితాను నవీకరించాలని సూచించారు.ఈ మొత్తం ప్రక్రియను జనవరి 2026 లోగా పూర్తి చేయాలని తెలిపారు.ఈ వీడియో సమావేశంలో జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్,అదనపు కలెక్టర్లు,రెవెన్యూ డివిజనల్ అధికారులు,తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.




## ఘనంగా జాతీయ గణిత దినోత్సవ వేడుకలు






తెలుగు గళం న్యూస్ స్టేషన్ ఘనపూర్ 22: జనగామ జిల్లా స్టేషన్ ఘనపూర్ తాటికొండ గ్రామములో శ్రీనివాస రామానుజన్ జన్మదినాన్ని పురస్కరించుకుని తాటికొండ ఉన్నత పాఠశాలలో జాతీయ గణిత దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.విద్యార్థులు ప్రదర్శించిన పలు గణిత నమూనాలు ఆకర్షణగా నిలిచాయి.విద్యార్థులందరూ ఉదయం నుంచి ఉత్సాహంగా గణిత వేడుకలో పాల్గొన్నారు.అనంతరం విద్యార్థులకు గణిత క్విజ్ నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ నిచ్చి గణిత నమూనాలను రూపొందించడంలో సహాయం అందించిన గణిత ఉపాధ్యాయులు రుద్ర,రంజిత్ కుమార్ అనసూయ ను ప్రధానోపాధ్యాయులు పెనుమాటి వెంకటేశ్వర్లు అభినందించారు.ఉత్తమ గణిత మోడల్స్ తయారుచేసిన విద్యార్థులకు బహుమతి అందజేశారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్,సలావుద్దీన్, పిడి.గిరెడ్డి ప్రమోద్ రెడ్డి,సోమేశ్వరి,జగదీష్,రవి తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాణ స్వీకారం చేసిన నూతన పాలకవర్గం



తెలుగు గళం న్యూస్ స్టేషన్ ఘనపూర్,డిసెంబర్ 22: జనగామ జిల్లా స్టేషన్ ఘనపూర్ మండలం పాంనూర్ గ్రామంలో నూతనంగా ఎన్నికయిన సర్పంచ్, ఉప సర్పంచ్,వార్డు సభ్యులను ప్రమాణ స్వీకారం గ్రామ కార్యదర్శి సునీల్ కృష్ణ ఆధ్వర్యంలో జరిగింది.సర్పంచ్ పోలెపల్లి సంపత్ రెడ్డి,ఉప సర్పంచ్,వార్డు సభ్యుల ప్రమాణస్వీకారం అనంతరం మాజీ సర్పంచులు,ఎంపీటీసీలు,నూతనంగా ఎన్నికైన సర్పంచ్,ఉప సర్పంచ్,వార్డు సభ్యులను శాలువాతో సన్మానించారు.ఈ సందర్భంగా సర్పంచ్ పోలెపల్లి సంపత్ రెడ్డి మాట్లాడుతూ..గ్రామంలో ఎలక్షన్ల ముందు ఇంటింటి ప్రచారంలో ప్రజలు గ్రామంలోని పలు సమస్యల గురించి చెప్పారు.మీ అందరి సహకారంతో ఒక్కొక్క సమస్యను పరిష్కరించుకుందామని అన్నారు.మన గ్రామాన్ని మనం అందరం కలిసి అభివృద్ధి చేసుకుందామని చెప్పారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు,ఎంపీటీసీలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## "తమ్మడపల్లి జి గ్రామాన్ని ఢిల్లీ వరకూ గుర్తింపు పొందే ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతా

### -సర్పంచ్ అన్నం స్వప్నరాణి బ్రహ్మారెడ్డి

### తమ్మడపల్లి జి గ్రామంలో ఘనంగా సర్పంచ్-ఉపసర్పంచ్,వార్డు సభ్యుల ప్రమాణ స్వీకారం



తెలుగు గళం న్యూస్/జఫర్గఢ్: జనగామ జిల్లా జఫర్గఢ్ మండలం తమ్మడపల్లి జి గ్రామంలో నూతనంగా ఎన్నికైన సర్పంచ్,ఉపసర్పంచ్ మరియు వార్డు సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.గ్రామ కార్యదర్శి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సర్పంచ్ అన్నం స్వప్నరాణి బ్రహ్మారెడ్డి,ఉపసర్పంచ్ ముక్కెర గంగరాజుతో పాటు వార్డు సభ్యులు అధికారికంగా ప్రమాణ స్వీకారం చేశారు.ఈ సందర్భంగా జరిగిన సభలో సర్పంచ్ అన్నం స్వప్నరాణి బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ..తమ్మడపల్లి జి గ్రామాన్ని రాష్ట్రానికే కాకుండా ఢిల్లీలో కూడా గుర్తింపు పొందేలా ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతానని అన్నారు.గత సర్పంచులు చేపట్టిన అభివృద్ధి పనులు అభినందనీయమని పేర్కొంటూ,గ్రామాన్ని అన్ని రంగాల్లో సంపూర్ణ అభివృద్ధి దిశగా తీసుకెళ్లేందుకు ప్రజాప్రతినిధులు,అధికారులు,గ్రామ ప్రజల సహకారంతో నిరంతరం కృషి చేస్తానని తెలిపారు.ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే లక్ష్యంగా పనిచేస్తామని,ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు.ఈ క్రమంలో గ్రామానికి చెందిన ప్రభుత్వ,ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు జనవరి నెలలో క్విజ్ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచులు గుజ్జరి రాజు,మారేపల్లి ప్రభాకర్,అన్నెపు పద్మా అశోక్,చిట్టిమల్ల క్రిష్ణమూర్తి,మాజీ ఉపసర్పంచ్ శరీఫుద్దీన్,సీపీఎం నాయకులు రాపర్తి రాజు,సోమయ్య,గుండె బోయిన రాజు,షబానా షంషుద్దీన్,ఉపాధ్యాయులు,గ్రామ పెద్దలు,ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని నూతన ప్రజాప్రతినిధులకు శుభాకాంక్షలు తెలిపారు.



## కొత్తపల్లి గోరి మండల కేంద్రంలో సర్పంచ్ పదవి ప్రమాణ స్వీకరణ మహోత్సవం ఘనంగా నిర్వహణ



తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి కొత్తపల్లి గోరి: కొత్తపల్లి గోరి మండల కేంద్రంలో గ్రామ సర్పంచ్ పదవి ప్రమాణ స్వీకరణ మహోత్సవం గ్రామ ప్రజల సమక్షంలో అత్యంత వైభవంగా జరిగింది.ఈ కార్యక్రమం భారీ సంఖ్యలో ప్రజల హాజరుతో కన్నుల పండుగగా మారింది.ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన గ్రామ సర్పంచ్‌గా నిమ్మల శంకర్ అధికారుల సమక్షంలో పదవి ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు చేపట్టారు.అనంతరం ఆయన్ను శాలువాతో ఘనంగా సన్మానించారు.వేదపండితులు, గ్రామ పెద్దలు సర్పంచ్‌కు ఆశీర్వచనాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.అదే విధంగా ఉప సర్పంచ్‌గా సుదనబోయిన రవి తో పాటు వార్డు సభ్యులు కూడా అధికారుల చేత పదవి ప్రమాణ స్వీకారం చేశారు.ప్రమాణ స్వీకరణకు ముందు గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు డా. బి.ఆర్. అంబేద్కర్,ఛత్రపతి శివాజీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా సర్పంచ్ నిమ్మల శంకర్ మాట్లాడుతూ.. గ్రామ అభివృద్ధే తమ ప్రధాన లక్ష్యమని, పాలకవర్గం అంతా సమిష్టిగా కృషి చేస్తూ కొత్తపల్లి గోరి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా అందరినీ కలుపుకొని సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తామని తెలిపారు.ఇందుకు గ్రామ ప్రజలందరి సహకారం అవసరమని కోరారు. తనకు సహకరించిన గ్రామ ప్రజలు, యువత, మహిళలు, గ్రామ పెద్దలు, అధికారులు, మీడియా ప్రతినిధులందరికీ పేరుపేరున కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులుగా దుమాల పద్మ-నగేష్, తుమ్మరపల్లి వేణు, రాచర్ల విజయ కోటి, నెల్లి వేణు, పల్లెబోయిన తిరుపతి, ఈర్ల పైడి, సాదు తిరుపతి, నిమ్మల సరిత సూర్యం, పసుల రమ్య-రాకేష్, ఆకుల అనూష, అప్పనీ మంజుల శ్రీనివాస్ పదవి బాధ్యతలు స్వీకరించారు.అలాగే గ్రామ పెద్దలు, మాజీ ఎంపీటీసీ హమీద్,బీఆర్ఎస్ టౌన్ అధ్యక్షుడు రఘుసాల తిరుపతి,సూదనబోయిన సుమన్, భట్టు శ్రీనివాస్, గడ్లే బాపురావు, నిమ్మల రాజు, బమ్మ తిరుపతి, నరేడ్ల కుమారస్వామి, పల్లెబోయిన నవీన్, పుట్ట తిరుపతి, రఘుసాల వీరన్న, వనం శ్రీనివాస్, బోడకుంట్ల అశోక్, గోపు సాగర్, విజయ్, బొమ్మకంటి సుధాకర్, మహేష్, యాకుబాబు తదితరులు పాల్గొని నూతన పాలకవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంతో గ్రామంలో ఉత్సాహభరిత వాతావరణం నెలకొనగా, నూతన పాలకవర్గంపై గ్రామ ప్రజలు ఆశలు పెట్టుకున్నారు.



## కేశవ్ మెమోరియల్ ఇన్స్టిట్యూట్‌లో జాతీయ భాషా సదస్సు

### తెలుగు భాష అమ్మ వంటిది: వెంకయ్య నాయుడు





తెలుగు గళం న్యూస్ హైదరాబాద్,నారాయణగూడ: భారతీయ సంస్కృతి,మాతృభాష పట్ల అవగాహన పెంపొందించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడు అన్నారు.సోమవారం నారాయణగూడలోని కేశవ్ మెమోరియల్ విద్యాసంస్థల ఆడిటోరియంలో నిర్వహించిన జాతీయ భాషా సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.కేశవ్ మెమోరియల్ ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షుడు అన్నదానం సుబ్రమణ్యం అధ్యక్షతన జరిగిన ఈ సదస్సును భారతీయ భాషా సమితి,కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ,విద్యా భారతి ఉచ్ఛ శిక్షా సంస్థాన్ సంయుక్తంగా నిర్వహించాయి.ఈ సందర్భంగా వెంకయ్య నాయుడు మాట్లాడుతూ,భాష ఇంటి నుంచే మొదలవుతుందని పేర్కొంటూ తల్లిదండ్రులు పిల్లలతో మాతృభాషలోనే మాట్లాడాలని సూచించారు.తెలుగు దేశభాషలలో అత్యంత ప్రాచీనమైనదిగా,విశాలమైన సాహిత్య సంపద కలిగిన భాషగా నిలిచిందన్నారు.కాన్వెంట్ విద్య విస్తరించని కాలంలోనే తెలుగు మహానుభావులు ప్రపంచ ఖ్యాతి సాధించారని గుర్తు చేశారు.మాతృభాషలోని మాధుర్యం,అమ్మ చేతి వంటలోని కమ్మదనం,అమ్మ ఒడిలోని ఆత్మీయత మరెక్కడా దొరకదని వ్యాఖ్యానించారు.అందుకే తెలుగు భాష అమ్మ వంటిదని,దానిని గౌరవంగా కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు.భాష పరిరక్షణ ప్రజల బాధ్యతతో పాటు పాలకుల బాధ్యత కూడా అని స్పష్టం చేశారు.పాఠశాల స్థాయిలో తెలుగును ప్రాథమిక బోధన భాషగా కొనసాగించాల్సిన అవసరం ఉందని,భాషను వినియోగించినప్పుడే అది సజీవంగా ఉంటుందని చెప్పారు.రోజువారీ జీవితంలో తెలుగును విస్తృతంగా ఉపయోగించాలని విద్యార్థులకు సూచించారు.విద్యాసంస్థల్లో ఇలాంటి జాతీయ భాషా సదస్సులు నిర్వహించడం వల్ల విద్యార్థుల్లో భాషా చైతన్యం,సాంస్కృతిక విలువలు పెరుగుతాయని తెలిపారు.ఈ సందర్భంగా 'భారతీయ భాషా పరివార్-భాషాశాస్త్రంలో ఒక కొత్త రూపరేఖ'భారతీయ భాషా పరివార్-పర్స్పెక్టివ్స్ అండ్ హరైజన్స్'అనే పుస్తకాలను వెంకయ్య నాయుడు ఆవిష్కరించారు.కార్యక్రమంలో కేశవ్ మెమోరియల్ ఎడ్యుకేషనల్ సొసైటీ వైస్ ప్రెసిడెంట్ నరసింహారావు,జాయింట్ సెక్రటరీ శ్రీధర్ రెడ్డి,డైరెక్టర్ నాగేశ్వరరావు,ఎఫ్ఎల్‌యు వైస్ ఛాన్సలర్ నాగరాజు,మురళీ మనోహర్,మధుసూదన్,ప్రిన్సిపాల్ శాంతి వేదుల తదితరులు పాల్గొన్నారు.సదస్సులో వివిధ కళాశాలలకు చెందిన అధ్యాపకులు,పరిశోధన విద్యార్థులు 100కు పైగా పరిశోధనా పత్రాలను సమర్పించారు.కార్యక్రమానికి ముందు విద్యార్థినిలు ప్రదర్శించిన సాంస్కృతిక నృత్యాలు ఆహుతులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

# రామగుండాలపల్లిలో సర్పంచ్ గా ఎడెల్లి మోహన్ రెడ్డి ప్రమాణ స్వీకరణ

## ముఖ్య అతిథిగా పాల్గొన్న మిషన్ భగీరథ ఏఈఈ వెన్నెల






తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి కొత్తపల్లి గోరి: భూపాలపల్లి జిల్లా కొత్తపల్లి గోరి మండలంలోని రామగుండాలపల్లి గ్రామంలో నూతనంగా ఎన్నికైన గ్రామ సర్పంచ్ ఎడెల్లి మోహన్ రెడ్డి పదవి ప్రమాణ స్వీకరణ కార్యక్రమం గ్రామ ప్రజల సమక్షంలో ఘనంగా నిర్వహించబడింది.ఈ కార్యక్రమానికి విచ్చేసిన అధికారులను గ్రామ పంచాయతీ పాలకవర్గం ఘనంగా సన్మానించింది.సర్పంచ్ ఎడెల్లి మోహన్ రెడ్డి ప్రమాణ స్వీకరణ సందర్భంగా కార్యక్రమానికి హాజరైన ఏఈఈ వెన్నెల,గ్రామ కార్యదర్శి కొమ్మలు లను రామగుండాలపల్లి గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్ కలిసి శాలువాలతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ అభివృద్ధిలో అధికారులు అందిస్తున్న సహకారం అభినందనీయమని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో నూతన పాలకవర్గ సభ్యులు కూడా పదవి బాధ్యతలు చేపట్టారు.

గ్రామ పాలకవర్గం వివరాలు ఇలా ఉన్నాయి:

సర్పంచ్ – ఎడెల్లి మోహన్ రెడ్డి

ఉప సర్పంచ్ –మామిడి కవిత

వార్డు సభ్యులు:

1వ వార్డు – మడప విష్ణువర్ధన్

2వ వార్డు – గుడి కందుల విష్ణు

3వ వార్డు – ఆల్లం శిరీష

4వ వార్డు – మామిడి కవిత

5వ వార్డు – మామిడి శ్రీకాంత్

6వ వార్డు – ముదుతనపల్లి వనజ

ఈ కార్యక్రమంలో యూత్ అధ్యక్షుడు కట్కూరి విష్ణు,గ్రామ అధ్యక్షులు ముడితనపల్లి రాజు, గణపతి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎడెల్లి మల్లారెడ్డి, దుంపల మోహన్ రెడ్డి,ఎడెల్లి తిరుపతి రెడ్డి తదితరులు పాల్గొని నూతన సర్పంచ్‌కి మరియు పాలకవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మాట్లాడుతూ, నూతన పాలకవర్గం గ్రామ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ప్రాధాన్యతనిస్తూ ప్రజలకు ఎప్పటికీ అందుబాటులో ఉండి పనిచేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో ముగిసింది.

# గణితంలో రాణిస్తే ఉజ్వల భవిష్యత్

## - నూతన సర్పంచ్ నడిపెల్లి శాంతాదేవి వెంకట్రావు




తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి కొత్తపల్లి గోరి: గణితంలో నైపుణ్యం సాధిస్తే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ తప్పక ఉంటుందని జగ్గయ్యపేట నూతన సర్పంచ్ నడిపెల్లి శాంతాదేవి వెంకట్రావు అన్నారు. గణిత శాస్త్ర పితామహుడు శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకొని సోమవారం జగ్గయ్యపేట ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులు తయారు చేసిన టీఎల్‌ఎం (టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్స్) నమూనాలను పరిశీలించిన సర్పంచ్,విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ శ్రీనివాస రామానుజన్ జీవిత చరిత్ర ప్రతి విద్యార్థికి స్ఫూర్తిదాయకమని అన్నారు.సాధారణ స్థితి నుంచి ప్రపంచ ఖ్యాతి గడించిన రామానుజన్ జీవితం కష్టపడి చదివితే ఎలాంటి అడ్డంకులైనా దాటవచ్చని తెలియజేస్తుందన్నారు. విద్యార్థులు గణితాన్ని భయపడకుండా ఆసక్తితో నేర్చుకుంటే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని ఆమె సూచించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల హెడ్మాస్టర్ ఓంటేరు చంద్రశేఖర్ మాట్లాడుతూ, గణితం అంటే కష్టం అనే అపోహను తొలగించాల్సిన అవసరం ఉందన్నారు. సరైన బోధన పద్ధతులు, టీఎల్‌ఎం ల వినియోగం ద్వారా గణితాన్ని సులభంగా అర్థం చేసుకోవచ్చని తెలిపారు. టీఎల్‌ఎం నమూనాల ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మకత పెరుగుతుందని, భావనాత్మక అవగాహన మరింత బలపడుతుందని ఆయన వివరించారు.కార్యక్రమంలో విద్యార్థులు స్వయంగా రూపొందించిన గణిత టీఎల్‌ఎం నమూనాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విద్యార్థుల ప్రతిభను ప్రశంసించిన అతిథులు, ఉపాధ్యాయులు వారికి అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ వార్డు మెంబర్లు దారవేన సరూప రమేష్, గంటా మహిపాల్, ఓడ్డాల శ్రీకాంత్, గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు గిరిధరకృష్ణ, రాజేందర్, చక్రధర్ రావు, కుమారస్వామి, శ్రీధర్, కోటిలింగం, కల్పనకుమారి, మహేందర్, శిరీష, శ్రీనివాస్, మాధవి, ప్రతాప్, రమాదేవి తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు.



# కొత్త సర్పంచ్‌ల ప్రమాణ స్వీకార కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే జీఎస్సార్

## ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ పారదర్శక పాలన సాగించాలి -ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు




తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి చిట్యాల/గణపురం: గ్రామ ప్రజల ఆశయాలను నెరవేర్చే విధంగా నూతనంగా ఎన్నికైన సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి పనిచేయాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు (జీఎస్సార్)పిలుపునిచ్చారు.ఈ రోజు సోమవారం చిట్యాల మండలం చల్లగరిగ, ఒడితల,గణపురం మండలం బుద్దారం, గణపురం, చెల్పూర్, భూపాలపల్లి మండలం మొరంచపల్లి గ్రామాల్లో నూతనంగా ఎన్నికైన గ్రామ సర్పంచ్‌లు మరియు గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యుల పదవి ప్రమాణ స్వీకార కార్యక్రమాలు ఘనంగా నిర్వహించబడ్డాయి.ఈ కార్యక్రమాల్లో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు,జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బట్టు కరుణాకర్ తో కలిసి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో నూతనంగా ఎన్నికైన సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులతో ఎమ్మెల్యే అధికారికంగా పదవి ప్రమాణ స్వీకారం చేయించారు.అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రజలు ఇచ్చిన విశ్వాసాన్ని నిలబెట్టుకునేలా పాలకవర్గం సమిష్టిగా పని చేయాలని సూచించారు.గ్రామాల అభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాలైన తాగునీరు, రహదారులు, పారిశుద్ధ్యం, విద్య, ఆరోగ్యం వంటి రంగాల్లో ప్రజా ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. పాలనలో పారదర్శకత, నిజాయితీ ఉండాలని, ప్రజల సమస్యలకు సత్వర పరిష్కారం చూపాలని నూతన పాలకవర్గాలకు సూచించారు.అలాగే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి అర్హుడికి చేరేలా సర్పంచ్‌లు, పాలకవర్గ సభ్యులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. ప్రజలకు ప్రభుత్వం–గ్రామ పంచాయతీ మధ్య వారధిగా నిలిచి అభివృద్ధి, సంక్షేమం రెండింటినీ సమన్వయంతో ముందుకు తీసుకెళ్లాలని తెలిపారు.కార్యక్రమం అనంతరం పలువురు ప్రజాప్రతినిధులు,నాయకులు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ని శాలువాలతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# టేకుమట్ల,మొగుళ్లపల్లి మండలాల్లో సర్పంచ్‌లు,పాలకవర్గ సభ్యుల ప్రమాణ స్వీకరణ

## ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి టేకుమట్ల/మొగుళ్లపల్లి: టేకుమట్ల మండలంలోని వెలిశాల గ్రామం,మొగుళ్లపల్లి మండలంలోని మొగుళ్లపల్లి,ఇస్సిపేట గ్రామాలలో నూతనంగా ఎన్నికైన గ్రామ సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు మరియు గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యుల పదవి ప్రమాణ స్వీకరణ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించబడ్డాయి.ఈ కార్యక్రమాల్లో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బట్టు కరుణాకర్ తో కలిసి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయా గ్రామాలలో నూతనంగా ఎన్నికైన సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు మరియు వార్డు సభ్యులతో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావుఅధికారికంగా పదవి ప్రమాణ స్వీకారం చేయించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ, ప్రజలు ఇచ్చిన నమ్మకాన్ని నిలబెట్టుకునే విధంగా పాలకవర్గం నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి పని చేయాలని సూచించారు.గ్రామాల అభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.ముఖ్యంగా తాగునీరు, రహదారులు, పారిశుద్ధ్యం, విద్య, ఆరోగ్య రంగాల్లో గ్రామాలు అన్ని విధాలుగా అభివృద్ధి చెందేలా ప్రజా ప్రభుత్వం అండగా నిలుస్తుందని స్పష్టం చేశారు.పాలనలో పారదర్శకత, నిజాయితీ ఉండాలని, ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని నూతన సర్పంచ్‌లు మరియు పాలకవర్గ సభ్యులకు సూచించారు.కార్యక్రమం అనంతరం పలువురు ప్రజాప్రతినిధులు,నాయకులు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ని శాలువాలతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు,గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# చెన్నాపూర్ గ్రామంలో సర్పంచ్ పదవి ప్రమాణ స్వీకరణ



తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి కొత్తపల్లి గోరి: చెన్నాపూర్ గ్రామంలో నూతనంగా ఎన్నికైన గ్రామ సర్పంచ్ పదవి ప్రమాణ స్వీకరణ కార్యక్రమం గ్రామ ప్రజల సమక్షంలో ఘనంగా నిర్వహించబడింది.పెద్ద సంఖ్యలో గ్రామస్తులు హాజరై ఈ కార్యక్రమాన్ని కన్నుల పండుగగా మార్చారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్‌గా పల్లెబోయిన బిక్షపతి అధికారుల చేత పదవి ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు చేపట్టారు.అనంతరం ఆయన్ను శాలువాతో సన్మానించారు. వేదపండితులు, గ్రామ పెద్దలు సర్పంచ్‌కు ఆశీర్వచనాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే ఉప సర్పంచ్‌గా తోట సారంగపాణితో పాటు వార్డు సభ్యులతో కూడా అధికారుల సమక్షంలో పదవి ప్రమాణ స్వీకారం చేయించారు.పదవి స్వీకరణ అనంతరం సర్పంచ్ పల్లెబోయిన బిక్షపతి మాట్లాడుతూ, గ్రామ అభివృద్ధికి పాలకవర్గం అంతా సమిష్టిగా కృషి చేస్తామని తెలిపారు. చెన్నాపూర్ గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేలా అందరినీ కలుపుకొని ముందుకు వెళ్తామని పేర్కొన్నారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా గ్రామాన్ని సమూలంగా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల్లో ముందుకు తీసుకెళ్లడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. ఇందుకు గ్రామ ప్రజలందరి సహకారం అవసరమని కోరారు. తనకు సహకరించిన గ్రామ ప్రజలు, యువత, మహిళలు, గ్రామ పెద్దలు, అధికారులు, మీడియా సోదరులకు పేరుపేరునా ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు అల్లే లలిత (1వ వార్డు), వేల్పుగొండ రవి (2వ వార్డు), పల్లెబోయిన రాజేందర్ (3వ వార్డు), చెలిక జమున (4వ వార్డు), బండారి మమత (5వ వార్డు), కొడిమాల సాంబయ్య (7వ వార్డు), లోకలబోయిన లావణ్య (8వ వార్డు) పదవి బాధ్యతలు స్వీకరించారు.అలాగే ఈ కార్యక్రమంలో ఏవో జీ సారయ్య, పంచాయతీ కార్యదర్శి నల్లెల సురేందర్, చెన్నాపూర్ గ్రామ కమిటీ అధ్యక్షుడు అల్లే దేవేందర్, మాజీ జెడ్పీటీసీ సాయిని విజయ ముత్యం, గ్రామ కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తలు,యువజన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు భవిష్యత్తు నిర్మాణంలో గణితం చాలా ముఖ్యం

## ఈ టెక్నో లో ఘనంగా జాతీయ గణిత దినోత్సవ వేడుకలు

## ఆకట్టుకున్న విద్యార్థుల గణిత విజ్ఞాన ప్రదర్శన




తెలుగు గళం న్యూస్ ఐనవోలు/డిసెంబర్ 22: హనుమకొండ జిల్లా :ఐనవోలు భవిష్యత్తు నిర్మాణంలో గణితం ఎంతో కీలకమైనదని ఏకశిలా విద్యాసంస్థల చైర్మన్ గౌరు తిరుపతిరెడ్డి అన్నారు. సోమవారం ఐనవోలు మండలం ఖమ్మం హైవే పై గల ఏకశిలా ఈ టెక్నో పాఠశాలలో జాతీయ గణిత దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం విద్యార్థులు స్వయంగా రూపొందించిన గణిత ప్రాజెక్టులను ప్రదర్శించారు. కాగా ప్రదర్శనను పాఠశాలలోని తోటి విద్యార్థులు సందర్శించి వాటి పనితీరు, ఉపయోగాలను అడిగి తెలుసుకున్నారు.



ఈ ప్రదర్శనలో పాల్గొని ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు షీల్డ్ లు అందించి అభినందనలు తెలిపారు. ప్రస్తుత సాంకేతిక రంగంలో విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడే గణిత విజ్ఞాన ప్రదర్శనను నిర్వహించడం పట్ల చైర్మన్ తిరుపతి రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ యండి. బాబా, వైస్ ప్రిన్సిపల్ కె.శ్రీనివాస్, గణిత శాస్త్ర విభాగ ఇంచార్జ్ జి.దేవేందర్, పాఠశాల ఉపాధ్యాయనీ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రధానమంత్రి నైపుణ్యాభివృద్ధి పథకంలో అక్రమాలు- కాగ్ నివేదిక




తెలుగు గళం న్యూస్ హైదరాబాద్: దేశ యువతకు ఉపాధి ఆధారిత నైపుణ్య శిక్షణ అందించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన ప్రధానమంత్రి నైపుణ్యాభివృద్ధి పథకంలో భారీ అక్రమాలు చోటుచేసుకున్నట్లు భారత కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) నివేదిక వెల్లడించింది.ఈ విషయంపై తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.2015 నుంచి 2022 వరకు అమలైన పథకాన్ని కాగ్ పరిశీలించగా,లక్షలాది లబ్ధిదారుల పేర్లతో నకిలీ బ్యాంకు ఖాతాలు,ఒకే ఖాతాను అనేక మందికి ఉపయోగించడం,ఒకే ఫోటోను పలుమార్లు నమోదు చేయడం వంటి అక్రమాలు బయటపడ్డాయి.అనేక చోట్ల శిక్షణ కేంద్రాలు మూసివేసి ఉన్నప్పటికీ, శిక్షణ జరిగినట్లు రికార్డులు చూపినట్లు నివేదిక తెలిపింది.పథకం ప్రకారం సర్టిఫికెట్ పొందిన ప్రతి అభ్యర్థికి రూ.500 ప్రోత్సాహకం ఇవ్వాల్సి ఉండగా,లక్షలాది మంది యువతకు ఇప్పటికీ ఈ మొత్తం అందలేదని కాగ్ స్పష్టం చేసింది.లబ్ధిదారుల వివరాల ధృవీకరణకు సరైన వ్యవస్థ లేకపోవడం వల్ల ప్రజాధనం భారీగా దుర్వినియోగమైనట్లు నివేదిక పేర్కొంది.సుమారు రూ.15 వేల కోట్ల బడ్జెట్ ఉన్న ఈ పథకంపై సమగ్ర విచారణ జరిపి,బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని మూడ్ శోభన్ డిమాండ్ చేశారు.

# తల్లాడ గ్రామ సర్పంచ్ గా ప్రమాణ స్వీకారం చేసిన చిన్నబ్బాయి

- ప్రమాణ స్వీకారానికి విచ్చేస్తున్న సందర్భంగా విజయోత్సవ ర్యాలీ లో పాల్గొన్న సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర
- ప్రమాణ స్వీకారం కి ఘనంగా తరలి వచ్చిన అభిమానులు
- దమ్ము ఉంటే గెలిచి చూపించు అన్నాడు ఆ చాలెంజ్ ను నిరూపించుకున్న
- తల్లాడ నారాయణ పురం గ్రామ ప్రజలు నాకు ఓటు రూపం లో యిచ్చిన తీర్పు రుణం తీర్చుకోలేనిది
- తల్లాడ గ్రామ పంచాయతీ నీ ఉత్తమ గ్రామ పంచాయతీగా తీర్చిదిద్దుతా



తల్లాడ/డిసెంబర్22. గళం న్యూస్: తల్లాడ మేజర్ గ్రామ పంచాయితీ సర్పంచ్ గా ప్రమాణ స్వీకారం చేసిన పెరిక.నాగేశ్వర రావు (చిన్నబ్బాయి) ముందు గా నారాయణపురం గ్రామం లో రామాలయం లో పూజలు నిర్వహించిన సర్పంచ్ పెరిక నాగేశ్వరావు చిన్నబ్బాయి, పూజ అనంతరం ప్రమాణ స్వీకారం కి విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ విజయోత్సవ ర్యాలీ కి ముఖ్యఅతిథిగా సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్రవెంకటవీరయ్య హాజరైనారు.నారాయణపురం నుంచి తల్లాడ వరకు అన్ని వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. తదనంతరం గ్రామపంచాయతీకి ప్రమాణ స్వీకరానికి సర్పంచ్ ఉప సర్పంచ్ వార్డు మెంబర్స్ అందరూ హాజరైనారు. తల్లాడ ఈవో కృష్ణారావు సర్పంచ్ ఉప సర్పంచ్ వార్డ్ నెంబర్లతో ప్రమాణ స్వీకారం చేపియటం జరిగింది.ఈ సందర్భంగా తల్లాడ గ్రామ సర్పంచ్ గా పెరిక నాగేశ్వరరావు మాట్లాడుతూ తల్లాడ నారాయణపురం గ్రామ ప్రజలు ఓటు ద్వారా నాకు ఇచ్చిన తీర్పు నా జీవితాంతం మీకు రుణపడి ఉంటా, ఎన్నికల ముందు కొంతమంది నాయకులు నీకు దమ్ముంటే గెలిచి చూపించు అన్నారు, ప్రజలు నాకు ఇచ్చిన తీర్పు అది ఈరోజు నిజమైనది.తల్లాడని ఉత్తమ గ్రామ పంచాయతీగా తీర్చిదిద్దే దాకా నేను పనిచేస్తానని మీ అందరికీ మాట ఇస్తున్న, ముందుగా గ్రామంలో కోతులు ప్రధాన సమస్యగా ఉంది. మొదటి ఈ సమస్యనే తీసుకొని గ్రామంలో కోతులు లేకుండా చేస్తానని మాట ఇస్తున్న , డ్రైనేజీల సమస్య , గ్రామపంచాయతీలో ఎ సమస్యలు ఉన్న, మీ అందరి కి నేను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటాను. నా వద్దకు రండి, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య గారి కృషితో, అదేవిధంగా రాజ్యసభ సభ్యులు బండి పార్థసారథి రెడ్డి, వద్ది రాజు రవిచంద్ర ల ఆశీస్సులతో తల్లాడ మేజర్ గ్రామపంచాయతీ అభివృద్ధికి నిధులు తీసుకొని వచ్చి నా శక్తి మేరకు నేను పనిచేస్తానని మాట ఇస్తున్న. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పెరిక నాగేశ్వరరావు (చిన్నబ్బాయి), ఉప సర్పంచ్ కర్నాటి లక్ష్మారెడ్డి, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రెడ్డెం వీర మోహన్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి దుగ్గిదేవర వెంకట లాల్, టిడిపి మండల నాయకులు ధూపాటి భద్రరాజు, మండల అధ్యక్షులు శ్రీనివాసరాజు, నాయకులు దగ్గుల.శ్రీనివాసరెడ్డి, గరిడేపల్లి వెంకటేశ్వర్లు (జి వి ఆర్), షేక్ ఈసూబ్, గుంటుపల్లి వెంకటయ్య, రాయల తిరుమలయ్య, వేమిరెడ్డి చిన్నకృష్ణారెడ్డి, ముకర.ధోనేష్, గుండ్ల. వేంకటేశ్వర్లు, మొక్క.కృష్ణార్జున్ , కొమ్మినేని. రామయ్య, షేక్. కామల్, దగ్గుల.రాజశేఖర్ రెడ్డి, మొక్క.సత్యనారాయణ, తుమ్మల పల్లి. రామరావు, టెంట్ హౌస్ సురేష్, తెల్లూరి. రఘు, వార్డు మెంబర్లు పెరిక. శ్రీలేఖ, ఏనిక. వెంకట లక్ష్మీ,గుంటుపల్లి. కుమారి,తదితరులు పాల్గొన్నారు.



# జగ్గయ్యపేట నూతన సర్పంచ్‌గా నడిపెల్లి శాంతాదేవి వెంకట్రావు

## గ్రామాభివృద్దే లక్ష్యంగా పనిచేస్తాం: ఎమ్మెల్యే గండ్ర సత్తన్న





తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి కొత్తపల్లి గోరి: జగ్గయ్యపేట గ్రామ నూతన సర్పంచ్‌గా నడిపెల్లి శాంతాదేవి వెంకట్రావు, ఉప సర్పంచ్‌గా శ్రీకాంత్ బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా గ్రామంలో ఘనంగా ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్తన్న హాజరై, నూతన ప్రజాప్రతినిధులకు శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర సత్తన్న మాట్లాడుతూ, గ్రామ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సర్పంచ్, ఉప సర్పంచ్‌లు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.గ్రామాల్లో మౌలిక వసతుల అభివృద్ధి, తాగునీరు, పారిశుధ్యం, రహదారులు, విద్య, ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా కృషి చేయాలని తెలిపారు. నూతన సర్పంచ్ నడిపెల్లి శాంతాదేవి వెంకట్రావు మాట్లాడుతూ, గ్రామ ప్రజల ఆశయాలకు అనుగుణంగా పారదర్శక పాలన అందిస్తామని, అభివృద్ధి పనులను వేగవంతం చేసి జగ్గయ్యపేటను ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు.ఉప సర్పంచ్ శ్రీకాంత్ కూడా ప్రజల సహకారంతో గ్రామాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఓబీసీ జిల్లా నాయకులు పొనుగంటి వీరబ్రహ్మం, గ్రామ వార్డు సభ్యులు దారవేన సరూప రమేష్, గంటా మహిపాల్, ఓడ్డాల శ్రీకాంత్‌తో పాటు గ్రామ పెద్దలు, నాయకులు, మహిళలు, యువకులు, ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొని నూతన ప్రజాప్రతినిధులను అభినందించారు.కార్యక్రమం మొత్తం ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగింది.

# జాతీయ విపత్తు నిర్వహణ అధికారం -ప్రజా భద్రతలో కీలక పాత్ర



భారతదేశం భౌగోళిక వైవిధ్యంతో కూడిన దేశం.ఈ వైవిధ్యం కారణంగా వరదలు, తుఫానులు, భూకంపాలు, కరువులు, అగ్ని ప్రమాదాలు వంటి అనేక రకాల సహజ మరియు మానవసృష్ట విపత్తులు తరచుగా సంభవిస్తుంటాయి.
ఇటువంటి విపత్తుల వల్ల ప్రాణ నష్టం,ఆస్తి నష్టం భారీగా జరుగుతోంది.ఈ పరిస్థితుల్లో విపత్తులను శాస్త్రీయంగా,సమర్థవంతంగా ఎదుర్కొనే అవసరం ఏర్పడింది.ఆ అవసరానికి ప్రతిఫలంగా కేంద్ర ప్రభుత్వం జాతీయ విపత్తు నిర్వహణ అధికారాన్ని ఏర్పాటు చేసింది.2005లో అమల్లోకి వచ్చిన విపత్తు నిర్వహణ చట్టం ప్రకారం జాతీయ విపత్తు నిర్వహణ అధికారాన్ని ఏర్పాటు చేశారు.ఈ సంస్థకు భారత ప్రధాని అధ్యక్షుడిగా వ్యవహరిస్తారు.దేశవ్యాప్తంగా విపత్తుల నిర్వహణకు సంబంధించిన విధానాలు,కార్యాచరణ ప్రణాళికలు రూపొందించడం ఈ సంస్థ యొక్క ప్రధాన బాధ్యత.జాతీయ విపత్తు నిర్వహణ అధికారం లక్ష్యం విపత్తులు సంభవించిన తరువాత సహాయక చర్యలకు మాత్రమే పరిమితం కాకుండా,ముందస్తు నివారణ చర్యలు చేపట్టడం,ప్రజల్లో అవగాహన పెంపొందించడం,విపత్తులను ఎదుర్కొనే సామర్థ్యాన్ని పెంచడం.విపత్తుల సమయంలో ప్రాణ నష్టం తగ్గించడం,ఆస్తి నష్టాన్ని నియంత్రించడం,వేగంగా సహాయ చర్యలు అందించడం ఈ సంస్థ ప్రధాన లక్ష్యాలుగా ఉన్నాయి.విపత్తు పరిస్థితుల్లో సహాయక చర్యలను సమర్థవంతంగా అమలు చేయడానికి జాతీయ విపత్తు స్పందన దళాన్ని ఈ అధికారం ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు.ఈ దళంలోని శిక్షణ పొందిన సిబ్బంది విపత్తు సంభవించిన వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని రక్షణ చర్యలు,బాధితుల తరలింపు,వైద్య సహాయం వంటి సేవలు అందిస్తారు.అనేక సందర్భాల్లో ఈ దళం ప్రాణాలను కాపాడడంలో కీలక పాత్ర పోషిస్తోంది.రాష్ట్రాలు,జిల్లాల స్థాయిలో విపత్తు నిర్వహణ ప్రణాళికలు రూపొందించేందుకు జాతీయ విపత్తు నిర్వహణ అధికారం మార్గదర్శకాలు జారీ చేస్తుంది.



పాఠశాలలు, కళాశాలలు, గ్రామాలు,పట్టణాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలను విపత్తులకు సిద్ధం చేస్తోంది.ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి ముందస్తు హెచ్చరికలు జారీ చేయడం ద్వారా ప్రమాదాలను తగ్గించే ప్రయత్నం చేస్తోంది.విపత్తుల నిర్వహణలో ప్రభుత్వంతో పాటు ప్రజల పాత్ర కూడా అత్యంత ముఖ్యమైనది.అధికారుల సూచనలను పాటించడం,ముందస్తు హెచ్చరికలను గమనించడం,విపత్తుల సమయంలో సహనం పాటించడం ద్వారా నష్టాన్ని గణనీయంగా తగ్గించవచ్చు.మొత్తంగా చూస్తే,జాతీయ విపత్తు నిర్వహణ అధికారం దేశ ప్రజల భద్రతకు కవచంలా నిలుస్తోంది.సమర్థవంతమైన ప్రణాళికలు,పటిష్టమైన అమలు,ప్రజల సహకారంతో విపత్తులను ఎదుర్కొని సురక్షితమైన భారతదేశాన్ని నిర్మించవచ్చని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

**“తెలుగు గళం న్యూస్ బ్యూరో రిపోర్టర్ ముహమ్మద్ సలీం”**

# సూరారం గ్రామపంచాయతీ సర్పంచ్‌గా మైదాసు ప్రభాకర్



తెలుగు గళం న్యూస్ జఫర్ఘడ్: జనగామ జిల్లా జఫర్ఘడ్ మండలం సూరారం గ్రామ పంచాయతీ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారోత్సవం నూతన గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఘనంగా జరిగింది.ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి కన్నా శైలజ నూతన సర్పంచ్ మైదాసు ప్రభాకర్‌తో ప్రమాణ స్వీకారం చేయించారు.అనంతరం వార్డు సభ్యులు తమ పదవులకు అనుగుణంగా దైవసాక్షిగా ప్రమాణం చేశారు.ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన సర్పంచ్ మైదాసు ప్రభాకర్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీ అభివృద్ధి కోసం తన వంతు కృషి చేస్తానని,ప్రజల సహకారంతో గ్రామాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మంచాల ఎల్లన్న హాజరయ్యారు.ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే కడియం శ్రీహరి,ఎంపీ కడియం కావ్య సహాయ సహకారాలతో గ్రామ అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయాలని సూచించారు.గ్రామాభివృద్ధి పార్టీలకు అతీతంగా,ఐక్యతతో ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు.అనంతరం గ్రామ నాయకులు,కుల సంఘాల పెద్దలు నూతనంగా ఎన్నికైన సర్పంచ్,ఉప సర్పంచ్,వార్డు సభ్యులను సన్మానించారు.కార్యక్రమం చివరగా నూతనంగా ఎన్నికైన సర్పంచ్,ఉప సర్పంచ్,వార్డు సభ్యులు కలిసి మొక్కను నాటి పర్యావరణ పరిరక్షణకు నాంది పలికారు.ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు,నాయకులు,యువకులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రజా సంక్షేమమే ధ్యేయంగా నూతన సర్పంచ్‌లు పని చేయాలి-ఎమ్మెల్యే గండ్ర సత్తన్న



తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి రేగొండ: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పెట్టుకొని నూతనంగా ఎన్నికైన సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులు సమిష్టిగా పని చేయాలని భూపాలపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు (జీఎస్సార్) పిలుపునిచ్చారు.రేగొండలో నూతనంగా ఎన్నికైన గ్రామ పంచాయతీ పాలక వర్గం పదవి ప్రమాణ స్వీకార కార్యక్రమం సోమవారం ఘనంగా జరిగింది.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే జీఎస్సార్,రేగొండ గ్రామ సర్పంచ్‌గా ఎన్నికైన వారణాశి మౌనిక అజయ్ (అంజి), రేగొండ గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్ ఎళ్లండి నరేష్ తో పాటు వార్డు సభ్యుల చేత పదవి ప్రమాణ స్వీకారం చేయించారు.అనంతరం నూతన పాలకవర్గ సభ్యులను శాలువాలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు మాట్లాడుతూ, గ్రామస్థులకు మెరుగైన పాలన అందించాలంటే సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న నేపథ్యంలో గ్రామ పంచాయతీలకు అవసరమైన నిధులు నిరంతరంగా అందుతాయని, వాటిని సద్వినియోగం చేసుకుని గ్రామాలను అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించాలని అన్నారు. ప్రజల సమస్యలకు ప్రాధాన్యతనిస్తూ పారదర్శక పాలనను అమలు చేయాలని, ప్రజల విశ్వాసాన్ని ఎప్పటికీ నిలబెట్టుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గుటోజు కిష్టయ్య, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఇప్పకాయల నరసయ్య,జిల్లా నాయకుడు గండి తిరుపతి గౌడ్,గ్రామ కమిటీ అధ్యక్షుడు ఏనుగు రవీందర్ రెడ్డి, యువజన నాయకులు తదితరులు పాల్గొని నూతన పాలకవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు.

# కడియం శ్రీహరి ని కలిసిన తమ్మడపల్లి జి గ్రామ సర్పంచ్ అన్నం స్వప్న బ్రహ్మారెడ్డి

## తమ్మడపల్లి జి గ్రామ అభివృద్ధికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి హామీ



తెలుగు గళం న్యూస్ హన్మకొండ: తమ్మడజనగామ జిల్లా జఫర్గడ్ మండలం పల్లి(జి) గ్రామంలో ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో భారీ మెజారిటీతో విజయం సాధించి ప్రమాణస్వీకారం చేసిన నూతన సర్పంచ్ అన్నం స్వప్న బ్రహ్మారెడ్డి సోమవారం తెలంగాణ రాష్ట్ర మాజీ ఉపముఖ్యమంత్రి,స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ శాసనసభ్యులు కడియం శ్రీహరిని మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా తమ్మడపల్లి(జి) గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయడానికి అవసరమైన మౌలిక వసతులు,సౌకర్యాల కల్పనకు తగిన నిధులు మంజూరు చేయాలని సర్పంచ్ ఎమ్మెల్యేను కోరారు.దీనికి స్పందించిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి గ్రామ అభివృద్ధికి ప్రాధాన్యం ఇచ్చి అవసరమైన అన్ని సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు.ఎమ్మెల్యే ఇచ్చిన హామీకి సంతోషం వ్యక్తం చేసిన సర్పంచ్ అన్నం స్వప్న బ్రహ్మారెడ్డి ఆయనకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# ప్రమాణస్వీకారం అనంతరం నూతన సర్పంచ్ అన్నం స్వప్న బ్రహ్మారెడ్డికి ఘన సన్మానం



తెలుగు గళం న్యూస్ జఫర్ఘడ్: ఇటీవల నిర్వహించిన స్థానిక సంస్థల ఎన్నికల్లో ఘన విజయం సాధించి,ప్రమాణస్వీకారం చేసిన అనంతరం తమ్మడపల్లి (జి) గ్రామ నూతన సర్పంచ్ అన్నం స్వప్న బ్రహ్మారెడ్డిని జఫర్గడ్ మండల కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు బానోతు రాజేష్ నాయక్,గట్టు రమేష్,బేబీ శ్రీనివాస్,అన్నెపు అశోక్,ఎడ్ల వెంకటస్వామి,రవి నాయక్,దేవేందర్ నాయక్ తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలియజేశారు.గ్రామ అభివృద్ధి, ప్రజాసంక్షేమ కార్యక్రమాలను ప్రాధాన్యతగా తీసుకుని ముందుకు సాగాలని వారు ఆకాంక్షించారు.

# విటమిన్ సి మన శరీరానికి అధికంగా లభించాలంటే ఏం చేయాలి..?

హెల్త్ న్యూస్, 22 డిసెంబర్ (తెలుగు గళం న్యూస్): మన శరీరానికి అవసరమయ్యే పోషకాల్లో విటమిన్ సి కూడా ఒకటి. దీనిని ఆస్కార్బిక్ ఆమ్లం అని కూడా పిలుస్తారు. విటమిన్ సి మన శరీరంలో అనేక విధులను నిర్వర్తిస్తుంది. శరీరంలో రోగనిరోధక శక్తిని మెరుగుపరచడంలో, మనం తీసుకున్న ఆహారంలో ఉండే ఐరన్ ను శరీరం గ్రహించేలా చేయడంలో, చర్మ ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో, ఎముకలను ఆరోగ్యంగా ఉంచడంలో విటమిన్ సి కీలక పాత్ర పోషిస్తుంది. అయితే విటమిన్ సి ని మన శరీరం తయారు చేయలేదు. అలాగే విటమిన్ సి ని శరీరం నిల్వ ఉంచుకోదు. కనుక మనం ప్రతిరోజూ ఆహారం ద్వారా విటమిన్ సి ని తీసుకోవాల్సిందే. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ ప్రకారం పెద్దలు, మహిళలు రోజూ 75 మిల్లీ గ్రాములు, పురుషులు 90 మిల్లీగ్రాముల విటమిన్ సి ని తీసుకోవాలి. సహజ సిద్దమైన, బలవర్దకమైన ఆహారాల ద్వారా శరీరానికి కావల్సిన విటమిన్ సిని మనం రోజూ తీసుకోవచ్చు.




ఏయే పండ్లలో ఎంత..?

ప్రతిరోజూ విటమిన్ సి అధికంగా ఉండే పండ్లను తీసుకోవాలి. నారింజ, నిమ్మ, ఉసిరి, జామ, మామిడి, కివి వంటి పండ్లల్లో విటమిన్ సి అధికంగా ఉంటుంది. నారింజ పండులో 70 మిల్లీగ్రాముల విటమిన్ సి ఉంటుంది. ఇది రోజువారి విటమిన్ సి అవసరాలను తీరుస్తుంది. అలాగే కివిలో దాదాపు 65 మిల్లీ గ్రాములు, ఒక కప్పు స్ట్రాబెర్రీలలో 59 మిల్లీగ్రాముల విటమిన్ సి ఉంటుంది. మనకు చవకగా లభించే జామకాయలను తీసుకోవడం వల్ల మన శరీరానికి కావల్సిన విటమిన్ సి ని రెండింతల పరిమాణంలో పొందవచ్చు. పైనాపిల్, మామిడి, బొప్పాయి వంటి పండ్లల్లో కూడా దాదాపు శరీర అవసరాలకు సరిపోయేంత విటమిన్ సి ఉంటుందని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. కనుక ఆహారంలో భాగంగా రోజూ పండ్లను తీసుకోవడం వల్ల విటమిన్ సి లోపం తలెత్తకుండా చూసుకోవచ్చు.

కూరగాయల్లోనూ..


పండ్లు మాత్రమే కాకుండా విటమిన్ సి ఉండే కూరగాయలను కూడా ఆహారంలో భాగంగా చేసుకోవాలి. క్యాప్సికంలో విటమిన్ సి ఎక్కువగా ఉంటుందని అధ్యయనాలు చెబుతున్నాయి. 100 గ్రాముల ఆకుపచ్చ క్యాప్సికంలో 16.5 మిల్లీగ్రాములు, పసుపు రంగు క్యాప్సికంలో 159.61 మిల్లీగ్రాములు, ఎరుపు క్యాప్సికంలో 81.19 మిల్లీగ్రాముల విటమిన్ సి ఉంటుంది. 100గ్రాముల బ్రోకలీలో 65 మిల్లీగ్రాములు, 100 గ్రాముల పాలకూరలో 28.1 మిల్లీగ్రాముల విటమిన్ సి ఉంటుంది. టమాటాలను తీసుకోవడం వల్ల రోజు వారి అవసరాలలో దాదాపు 28 శాతం విటమిన్ సి లభిస్తుంది. కొన్ని రకాల ఆహార పదార్థాలు వాటి పోషక విలువలను పెంచుకోవడానికి విటమిన్ సి తో బలవర్దకపరచబడతాయి. రోజూ తృణ ధాన్యాలను తీసుకోవడం వల్ల శరీరానికి కావల్సిన పోషకాలతోపాటు కొద్ది మొత్తంలో విటమిన్ సి ని కూడా పొందవచ్చు.

వంట చేసేటప్పుడు..

ఇక విటమిన్ సి నీటిలో కరుగుతుంది. వేడికి కూడా సున్నితంగా ఉంటుంది. కనుక మన వంట పద్దతులను మార్చుకోవాలి. సాధ్యమైనప్పుడల్లా పండ్లను, కూరగాయలను పచ్చిగానే తీసుకోవాలి. కూరగాయలను నీటిలో వేసి మరిగించడానికి బదులుగా ఆవిరి మీద ఉడికించాలి. ఇలా చేయడం వల్ల మనం తీసుకునే ఆహారాల నుండి విటమిన్ సి తొలగిపోకుండా ఉంటుంది. శరీరంలో తగినంత విటమిన్ సి ఉంటేనే మనం తీసుకునే ఆహారాల్లో ఉండే ఐరన్ మన శరీరానికి అందుతుంది. కనుక పాలకూర, కూరగాయలు, బీన్స్ వంటి వాటితో విటమిన్ సి ఉండే ఆహారాలను కలిపి తీసుకోవాలి. సలాడ్, సూప్స్ లలో నిమ్మరసం కలిపి తీసుకోవడం, భోజనంతో నారింజ రసాన్ని తాగడం వంటివి చేయాలి. ఇలా చేయడం వల్ల మన శరీరానికి కావల్సిన విటమిన్ సి ని రోజూ పొందవచ్చు. విటమిన్ సి లోపంతో బాధపడే వారు ఈ పద్దతులను రోజూ పాటించడం వల్ల మంచి ఫలితాలను పొందవచ్చు.

# కళ్ల కింద ఏర్పడే నల్లని వలయాలు.. డార్క్ సర్కిల్స్‌ను ఇలా సింపుల్ చిట్కాలతో తగ్గించుకోవచ్చు..!

హెల్త్ న్యూస్, 22 డిసెంబర్ (తెలుగు గళం న్యూస్): డిజిటల్ వస్తువుల వినియోగం కారణంగా మనలో చాలా మంది కళ్ల చుట్టూ డార్క్ సర్కిల్స్ సమస్యతో బాధపడుతున్నారు. ముఖ అందాన్ని ఈ డార్క్ సర్కిల్స్ ఎంతగానో దెబ్బతీస్తాయని చెప్పవచ్చు. కేవలం డిజిటల్ వస్తువుల వినియోగం ద్వారా మాత్రమే కాకుండా నిద్రలేమి, వయసు పైబడడం, చర్మం కొల్లాజెన్ ఉత్పత్తిని కోల్పోవడం, చర్మంలో మెలనిన్ తక్కువగా ఉండడం, జన్యుపరమైన కారణాల వల్ల కూడా కళ్ల చుట్టూ నల్లటి వలయాలు వస్తూ ఉంటాయి. ఈ నల్లటి వలయాలను తొలగించుకోవడానికి అనేక రకాల క్రీములు, సీరమ్స్ వంటి వాటిని ఉపయోగిస్తూ ఉంటారు. ఖరీదైన నూనెలను వాడుతూ ఉంటారు. అయితే ఎటువంటి ఖర్చు లేకుండా చాలా సులభంగా సహజ సిద్దమైన ఇంటి చిట్కాలను ఉపయోగించి కళ్ల చుట్టూ వచ్చే ఈ నల్లటి వలయాలను తొలగించుకోవచ్చు.



కీరదోస, రోజ్ వాటర్..

కళ్ల చుట్టూ వచ్చే నల్లటి వలయాలను తొలగించడంలో కీరదోస ఎంతగానో సహాయపడుతుంది. దీని కోసం కీరదోస ముక్కలను మందంగా కట్ చేసి కళ్లపై అరగంట పాటు ఉంచాలి. తరువాత చల్లటి నీటితో కళ్లని శుభ్రం చేసుకోవాలి. ఇలా చేయడం వల్ల కంటి భాగంలో చర్మానికి రక్తప్రసరణ పెరుగుతుంది. కళ్లకు అలసట తగ్గి విశ్రాంతి లభిస్తుంది. ఇలా తరచూ చేయడం వల్ల కళ్ల చుట్టూ నల్లటి వలయాలు తగ్గి చర్మం కాంతివంతంగా తయారవుతుంది. అలాగే రోజ్ వాటర్ మన చర్మానికి టోనర్ గా పని చేస్తుందని చెప్పవచ్చు. దీనిని వాడడం వల్ల చర్మ కణాల ఆరోగ్యం మెరుగుపడుతుంది. కళ్ల చుట్టూ నల్లటి వలయాలతో బాధపడే వారు దూదిని లేదా కాటన్ ప్యాడ్ ను తీసుకుని రోజ్ వాటర్ లో ముంచి కళ్లపై సున్నితంగా రాయాలి. దీనిని 20 నిమిషాల పాటు అలాగే ఉంచి ఆ తరువాత శుభ్రం చేసుకోవాలి. ఇలా చేయడం వల్ల కళ్ల చుట్టూ నల్లటి వలయాలు తగ్గుతాయి. కళ్లకు ఉపశమనం కలుగుతుంది.

గ్రీన్ టీ బ్యాగ్స్, చల్లని పాలు..

గ్రీన్ టీ బ్యాగులను నీటిలో ముంచి ఆ తరువాత 30 నిమిషాల పాటు ఫ్రిజ్ లో ఉంచాలి. ఈ బ్యాగులు చల్లగా అయిన తరువాత కళ్లపై 10 నుండి 15 నిమిషాల పాటు అలాగే ఉంచాలి. తరువాత గోరు వెచ్చని నీటితో శుభ్రం చేసుకోవాలి. ఇలా చేయడం వల్ల కళ్ల చుట్టూ ఉండే నల్లటి వలయాలు తగ్గుతాయి. గ్రీన్ టీ లో యాంటీ ఆక్సిడెంట్లు, యాంటీ ఇన్‌ఫ్లామేటరీ లక్షణాలు అధికంగా ఉంటాయి. ఇవి కళ్ల చుట్టూ బిగుసుకుపోయిన రక్తనాళాలను సరిచేసి కళ్లకు రక్తప్రసరణ సాఫీగా సాగేలా చేయడంలో సహాయపడతాయి. అలాగే పాలల్లో విటమిన్ ఎ ఉంటుంది. ఇది చర్మాన్ని యవ్వనంగా, ప్రకాశవంతంగా మార్చడంలో సహాయపడుతుంది. కళ్ల చుట్టూ నల్లటి వలయాలు ఉన్నవారు చల్లని పాలల్లో కాటన్ ప్యాడ్ ను ముంచి కళ్లపై రాసుకుని 10 నిమిషాల పాటు అలాగే ఉంచాలి. తరువాత గోరువెచ్చని నీటితో శుభ్రం చేసుకోవాలి. ఇలా తరచూ చేయడం వల్ల కళ్ల చుట్టూ ఉండే నల్లటి వలయాలు త్వరగా తగ్గుతాయి.

పసుపు, నారింజ రసం..

పసుపులో విటమిన్ ఇ ఆయిల్ లేదా కొబ్బరి నూనె వేసి పేస్ట్ లాగా చేసుకోవాలి. ఈ పేస్ట్ ను కళ్ల చుట్టూ రాసి 10 నుండి 15 నిమిషాల పాటు అలాగే ఉంచాలి. తరువాత నీటితో శుభ్రం చేసుకోవాలి. పసుపులో యాంటీ ఇన్ ఫ్లామేటరీ లక్షణాలతో పాటు యాంటీ ఆక్సిడెంట్లు కూడా ఉంటాయి. పసుపు బ్లీచింగ్ లక్షణాలను కూడా కలిగి ఉంటుంది. కనుక కళ్ల చుట్టూ ఉండే నల్లటి వలయాలను తొలగించడంలో పసుపు చక్కగా పనిచేస్తుంది. అలాగే నారింజ రసంలో విటమిన్ ఎ, సి పుష్కలంగా ఉంటాయి. కళ్ల చుట్టూ నల్లటి వలయాలను తొలగించడంలో ఇవి చక్కగా పనిచేస్తాయి. ఒక గిన్నెలో కొద్దిగా నారింజ రసాన్ని తీసుకుని అందులో కొన్నిచుక్కల గ్లిజరిన్ ను వేసి బాగా కలపాలి. తరువాత ఈ మిశ్రమాన్ని కళ్లపై రాసి 20 నిమిషాల పాటు అలాగే ఉంచి ఆ తరువాత నీటితో శుభ్రం చేసుకోవాలి. ఇలా చేయడం వల్ల కళ్ల కింద నల్లటి వలయాలు తగ్గుతాయి.

ఆలుగడ్డలు..

కళ్ల కింద నల్లటి వలయాలను తొలగించడంలో ఆలుగడ్డలు కూడా మనకు ఎంతో సహాయపడతాయి. గంట పాటు ఆలుగడ్డను ఫ్రిజ్ లో ఉంచి ఆ తరువాత మందపాటి ముక్కలుగా కట్ చేయాలి. ఈ ముక్కలను 20 నిమిషాల పాటు కళ్లపై ఉంచి ఆ తరువాత నీటితో శుభ్రం చేసుకోవాలి. ఆలుగడ్డల్లో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు కళ్ల కింద నల్లటి వలయాలను తొలగించడంలో సహాయపడతాయి.

# క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన మరో ఐపీఎల్ స్టార్



స్పోర్ట్స్ న్యూస్, 22 డిసెంబర్ (తెలుగు గళం న్యూస్): ఐపీఎల్ ఫ్యాన్స్‌కు అలర్ట్. ఐపీఎల్ ఆడే మరో క్రికెటర్ రిటైర్మెంట్ ప్రకటించారు. కర్ణాటక స్టార్ ఆటగాడు కృష్ణప్ప గౌతమ్ అన్ని ఫార్మాట్లకు రిటైర్మెంట్ ప్రకటిస్తూ సంచలన ప్రకటన చేశాడు. ఐపీఎల్ లో దాదాపు 5 ఫ్రాంచైజీలకు ప్రాతినిధ్యం వహించిన కృష్ణప్ప గౌతమ్, మంచి ఆల్ రౌండర్ అన్న సంగతి తెలిసిందే. 37 ఏళ్ల కృష్ణప్ప గౌతమ్.. ఐపీఎల్ కెరీర్ లో ఇప్పటి వరకు 36 మ్యాచ్ లు ఆడి 247 పరుగులు సాధించాడు.

ఇందులో మొత్తం 21 వికెట్లు కూడా సాధించాడు. ఇండియన్ ప్రీమియర్ లీగ్ టోర్నమెంట్ లో రాజస్థాన్ రాయల్స్, పంజాబ్ కింగ్స్, చెన్నై సూపర్ కింగ్స్, లక్నో, ముంబై జట్లకు ప్రాతినిధ్యం వహించాడు. అటు 59 ఫస్ట్ క్లాస్ మ్యాచ్ లతో పాటు 68 లిస్ట్ -ఏ మ్యాచ్ ల్లో ప్రాతినిధ్యం వహించాడు. అందులో మొత్తం 320 వికెట్లు తీసి సత్తా చాటాడు. ఇటు టీమిండియా తరపున కేవలం ఒకే ఒక్క వన్డే ఆడాడు కృష్ణప్ప గౌతమ్. ఆ తర్వాత అతనికి ఛాన్సులు రాలేదు.

# ఢిల్లీ క్యాపిటల్స్ కెప్టెన్‌గా జెమీమా




స్పోర్ట్స్ న్యూస్, 22 డిసెంబర్ (తెలుగు గళం న్యూస్): స్వదేశంలో చెలరేగి ఆడుతున్న టీమిండియా స్టార్ జెమీమా రోడ్రిగ్స్ కు కీలక పదవి దక్కనుంది. ఇటీవలే వన్డే ప్రపంచకప్ సెమీఫైనల్లో అజేయ శతకంతో అదరగొట్టిన ఇకపై కెప్టెన్‌గా మైదానంలోకి దిగనుంది. అవును.. మహిళల ప్రీమియర్ లీగ్ నాలుగో సీజన్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ నాయకురాలిగా జెమీమా ఎంపిక దాదాపు ఖరారైంది. అయితే.. ఈ విషయాన్ని ఫ్రాంచైజీ ఇంకా వెల్లడించలేదు. కానీ, రేపోమాపో అధికారిక ప్రకటన వెలువడనుందని క్రిక్‌బజ్ కథనం పేర్కొంది.

భారత మహిళల జట్టులో కీలక ప్లేయర్‌గా ఎదిగిన జెమీమా రోడ్రిగ్స్ ప్రస్తుతం సూపర్ ఫామ్‌లో ఉంది. తాజాగా విశాఖపట్టణంలో శ్రీలంక బౌలర్లకు చుక్కలు చూపెడుతూ 69 నాటౌట్‌తో జట్టుకు భారీ విజయాన్ని కట్టబెట్టింది జెమీమా. టీ20ల్లో అనుభవంతో పాటు ఫామ్‌లోనూ ఉండడంతో జెమీమా కెప్టెన్సీ ఇవ్వాల్సిన సమయం వచ్చిందని ఢిల్లీ క్యాపిటల్స్ భావించింది. ఇండియా స్టార్‌కు సారథ్యం అప్పగిస్తున్నట్టు ఢిల్లీ సహ యజమాని పార్త్ జిందాల్ హింట్ ఇచ్చేశాడు.

'మా జట్టుకు భారత క్రికెటర్ కెప్టెన్‌గా ఉండాలనే విషయంలో మేము స్పష్టంగా ఉన్నాం' అని ఢిల్లీలో మెగా వేలం మధ్యలో జిందాల్ చెప్పాడు. దాంతో.. వేలంలో కొన్న లారా వొల్వార్ట్ బదులు జెమీమాకే కెప్టెన్సీ ఇస్తారనే వార్తలు వినిపించాయి. సో.. ప్రపంచకప్‌తో జెమీమా దశ తిరిగిందని అంటున్నారు విశ్లేషకులు.

మానసిక ఒత్తిడిని జయించి..

డబ్ల్యూపీఎల్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ తరపున జెమీమా రోడ్రిగ్స్ నిలకడగా రాణిస్తోంది. వరల్డ్‌కప్ సెమీఫైనల్లో బలమైన ఆస్ట్రేలియాపై అజేయ శతకం(127 నాటౌట్)తో టీమిండియాను గెలిపించింది బ్యాటర్. పేలవ ఫామ్‌తో ఒక మ్యాచ్‌కు బెంచ్‌కే పరిమితమైన తను.. ఆసీస్‌పై చిరస్మరణీయ ఇన్నింగ్స్ ఆడింది. మానసిక ఒత్తిడిని జయించి.. తానొక మ్యాచ్ విన్నర్ అని చాటుకుంది. మళ్లీ టచ్‌లోకి వచ్చిన ఈ ఈ స్టార్ ప్లేయర్‌ను డబ్ల్యూపీఎల్ నాలుగో సీజన్ కోసం ఢిల్లీ రూ.2.2 కోట్లకు అట్టిపెట్టుకుంది. ఢిల్లీ విజయాల్లో ముఖ్య భూమిక పోషిస్తున్న జెమీమా ఇప్పటివరకూ 27 మ్యాచుల్లో 139.66 స్ట్రయిక్ రేటుతో 507 పరుగులు చేసింది.

ఢిల్లీ ఫ్రాంచైజీ సోమవారం తమ ఎక్స్ ఖాతాలో ఒక వీడియో పోస్ట్ పెట్టింది. డిసెంబర్ 23 సాయంత్రం 6 గంటలకు బిగ్ అనౌన్స్‌మెంట్ రానుంది అని క్యాప్షన్ జోడించింది. దాంతో.. జెమీమాను కెప్టెన్‌గా ప్రకటించేందుకు ముహూర్తం ఫిక్స్ అయిందని అభిమానులు భావిస్తున్నారు.

# ఆ ఓటమితో కుంగిపోయా.. కోలుకోవడానికి రెండు నెలలు పట్టింది : రోహిత్




స్పోర్ట్స్ న్యూస్, 22 డిసెంబర్ (తెలుగు గళం న్యూస్): ఐసీసీ వన్డే వరల్డ్ కప్-2023 ఓటమి తనను ఎంతో బాధించిందని భారత దిగ్గజ క్రికెటర్, మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ తెలిపాడు. ఆ టోర్నీలో అద్భుత ప్రదర్శన చేసిన భారత జట్టు ఫైనల్‌లో ఆస్ట్రేలియా చేతిలో ఓడిపోయిన విషయం తెలిసిందే. తాజాగా ఓ కార్యక్రమంలో పాల్గొన్న రోహిత్ వన్డే వరల్డ్ కప్-2023ని గుర్తు చేసుకున్నాడు. 'ప్రతి ఒక్కరూ చాలా నిరాశ చెందారు. ఏం జరిగిందో మేము నమ్మలేకపోయాం. నాకు వ్యక్తిగత అది చాలా కఠినమైన సమయం. 2022లో నేను కెప్టెన్సీ చేపట్టినప్పటి నుంచి ఆ ప్రపంచకప్ కోసం ఎంతో కష్టపడ్డా. నా ఏకైక లక్ష్యం వరల్డ్ గెలవడమే. కాబట్టి, నేను చాలా కుంగిపోయా. అప్పుడు నా శరీరంలో శక్తి లేదు.'అని రోహిత్ గుర్తు చేసుకున్నాడు. అలాగే, ఆ ఓటమి నుంచి తిరిగి కోలుకోవడానికి తనకు రెండు నెలల సమయం పట్టిందని చెప్పాడు. 'ఆ ఓటమి నాకు పెద్ద పాఠం. నిరాశను ఎలా ఎదుర్కోవాలో?.. తిరిగి ఎలా పునరాలోచించుకోవాలో?.. తిరిగి కొత్తగా ఎలా ఆరంభించాలో? తెలుసుకున్నా. టీ20 ప్రపంచకప్-2024పై దృష్టి మళ్లించా. ఇప్పుడు చాలా ఈజీగా చెబుతున్నా కానీ అప్పుడు చాలా కఠినమైన పరిస్థితి.'అని రోహిత్ చెప్పుకొచ్చాడు. రోహిత్ నాయకత్వంలో గతేడాది టీమిండియా టీ20 వరల్డ్ కప్ గెలిచిన విషయం తెలిసిందే.

# పాకిస్తాన్ చేతిలో భారత్ ఘోర పరాజయం



స్పోర్ట్స్ న్యూస్, 22 డిసెంబర్ (తెలుగు గళం న్యూస్): అత్యంత కీలకమైన అండర్-19 ఆసియాకప్ ఫైనల్ మ్యాచ్‌లో టీమిండియా క్రీడాకారులు చేతులెత్తేశారు. పాకిస్తాన్‌తో దుబాయ్ వేదికగా జరిగిన మ్యాచులో టీమిండియా ఘోర పరాజయం పాలైంది. సీజన్ మొత్తం అదరగొట్టిన జట్టు.. కీలక ఫైనల్ మ్యాచులో నిరాశపర్చింది. 348 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో 156 పరుగులకే ఆలౌటైంది. దీంతో 191 పరుగుల భారీ తేడాతో ఓడిపోయింది. సూర్యవంశీ(26), జార్జ్(16), అభిజ్ఞాన్(13) తక్కువ పరుగులకే వెనుదిరిగారు. చివర్లో దీపేశ్ దేవేంద్రన్ (16 బంతుల్లో 36) దూకుడుగా ఆడిన ఫలితం లేకుండా పోయింది. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన పాక్.. నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 347 పరుగులు చేసింది. ఓపెనర్ సమీర్ మిన్హాస్ (172) భారీ శతకం చేశాడు. అహ్మద్ హుస్సేన్ (56) హాఫ్ సెంచరీ చేశాడు. ఉస్మాన్ ఖాన్ (35), ఫర్హాన్ యూసుఫ్ (19), హంజా జహూర్ (18) పరుగులు చేశారు. భారత బౌలర్లలో దీపేశ్ దేవేంద్రన్ 3, హెనిల్ పటేల్ 2, ఖిలాన్ పటేల్ 2, కన్షిక్ చౌహాన్ ఒక వికెట్ తీశారు.

## ఇషాన్ కిషన్ రీఎంట్రీకి అదొక్కటే కారణం.. కీలక వ్యాఖ్యలు చేసిన అశ్విన్



స్పోర్ట్స్ న్యూస్, 22 డిసెంబర్ (తెలుగు గళం న్యూస్): భారత వికెట్ కీపర్, బ్యాటర్ ఇషాన్ కిషన్ టీ20 ప్రపంచకప్-2026కు ఎంపికైన విషయం తెలిసిందే. రెండేళ్ల తర్వాత అతను జాతీయ జట్టులోకి తిరిగి రావడంపై భారత మాజీ క్రికెటర్ ఆర్.అశ్విన్ స్పందించాడు. తన యూట్యూబ్ చానెల్‌లో మాట్లాడుతూ.. ఇషాన్‌కు రీఎంట్రీ అనేది క్రికెట్ ఇచ్చిన గిఫ్ట్ అని వ్యాఖ్యానించాడు. 'అతన్ని తీసుకోవడాన్ని కొందరు న్యాయం అనుకోవచ్చు. ఇంకొందరు అన్యాయం అనుకోవచ్చు. కానీ, జీవిత చక్రం తిరిగి అక్కడికే వస్తుంది. అతను జట్టులో ఉండటానికి ఒకే కారణం ఉంది. క్రికెట్‌ను గౌరవించాడు.'అని తెలిపాడు. అలాగే, దేశవాళీ క్రికెట్ ఆడటాన్ని ఇషాన్ కిందపడటంగా చూడలేదని, తిరిగి రావడానికి ఏకైక మార్గంగా భావించాడని చెప్పాడు. ఇది కేవలం ఇషాన్ కిషన్ అనే వ్యక్తి గురించి కాదని, ఆటను గౌరవించి సక్సెస్ అయిన క్రికెటర్ ఇషాన్ కిషన్ గురించి అని తెలిపాడు.

# సినిమా న్యూస్

## మళ్ళీ ఫామ్‌లోకి పూజా హెగ్డే



బుట్టబొమ్మ పూజా హెగ్డేకి టాలీవుడ్‌లో ఈ మధ్య టైమ్ అస్సలు కలిసి రావట్లేదు. మహేష్ బాబు 'గుంటూరు కారం' సినిమా నుంచి బయటకు వచ్చిన తర్వాత తెలుగులో ఆఫర్లు తగ్గాయి. స్టార్ హీరోలే కాదు, మీడియం రేంజ్ హీరోలు కూడా పూజాని పెద్దగా పట్టించుకోలేదు. అయితే, టాలీవుడ్‌లో గ్యాప్ వచ్చినా పూజా మాత్రం అస్సలు తగ్గట్లేదు. తమిళ, హిందీ పరిశ్రమలు ఈమెకు అండగా నిలిచాయి. ప్రస్తుతం ఆమె చేతిలో నాలుగు భారీ ప్రాజెక్టులు ఉన్నాయి. తమిళంలో దళపతి విజయ్ సరసన 'జన నాయగన్', రాఘవ లారెన్స్‌తో 'కాంచన 4' చేస్తూ బిజీగా ఉంది. అటు బాలీవుడ్‌లో వరుణ్ ధావన్‌తో కలిసి 'హై జవాని తో ఇష్క్ హొనా హై' సినిమాలో నటిస్తూ తన స్టార్ ఇమేజ్ కోసం గట్టిగానే ట్రై చేస్తుంది.ఇక తెలుగు ప్రేక్షకులకు అదిరిపోయే న్యూస్ ఏంటంటే.. చాలా కాలం తర్వాత పూజా హెగ్డే మళ్ళీ టాలీవుడ్‌లోకి రీ-ఎంట్రీ ఇస్తోంది. మలయాళ స్టార్ దుల్కర్ సల్మాన్ హీరోగా రవి నెలకుడితి దర్శకత్వంలో వస్తున్న సినిమాలో పూజా హీరోయిన్‌గా ఛాన్స్ కొట్టేసింది. ప్రస్తుతం ఈమె తన గ్లామర్‌ని, యాక్టింగ్‌ని నమ్ముకుని ఈ సినిమాలపైనే పూర్తి ఫోకస్ పెట్టింది. ఒకప్పుడు సౌత్ ఇండియాను ఊపేసిన ఈ బుట్టబొమ్మ, ఇప్పుడున్న ఈ నాలుగు సినిమాల్లో ఒక్కటి హిట్టయినా మళ్ళీ స్టార్ స్టేటస్ అందుకోవడం పక్కా. తన కాన్ఫిడెన్స్ ఏమాత్రం కోల్పోకుండా, అవసరమైతే టైర్-2 హీరోలతో కూడా నటించేందుకు రెడీ అంటోంది. మరి ఈ లైనప్‌తో పూజాకి మళ్ళీ పాత రోజులు వస్తాయో లేదో చూడాలి!

## సలార్-2'పై ప్రశాంత్ నీల్ బిగ్ క్లూ..



రెబల్ స్టార్ ప్రభాస్, మాస్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో వచ్చిన 'సలార్' బాక్సాఫీస్‌ను షేక్ చేసిన సంగతి తెలిసిందే. ప్రభాస్‌ను మునుపెన్నడూ లేని పవర్‌ఫుల్ లుక్‌లో చూపించిన ఈ సినిమా రిలీజ్ అయి నేటికి సరిగ్గా రెండేళ్లు పూర్తయింది. దీంతో సోషల్ మీడియాలో ప్రభాస్ ఫ్యాన్స్ 'సలార్' ముచ్చట్లను మళ్లీ ట్రెండ్ చేస్తున్నారు. సినిమా వచ్చి రెండేళ్లు అవుతున్నా ఇప్పటి వరకు 'సలార్-2' (శౌర్యాంగ పర్వం) షూటింగ్ గురించి మేకర్స్ నుండి ఎలాంటి అధికారిక క్లారిటీ లేకపోవడంతో అభిమానులు కొంచెం అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రభాస్ వరుస సినిమాలతో బిజీగా ఉండటం, ప్రశాంత్ నీల్ కూడా తన తదుపరి ప్రాజెక్టులపై ద ృష్టి పెట్టడంతో సీక్వెల్ ఎప్పుడనేది హాట్ టాపిక్‌గా మారింది. అయితే, సలార్-2 గురించి గతంలో ప్రశాంత్ నీల్ ఇచ్చిన ఒక అదిరిపోయే అప్‌డేట్ ఇప్పుడు ఫ్యాన్స్‌కు ధైర్యాన్నిస్తోంది.

"సలార్-2 నా కెరీర్‌లోనే ది బెస్ట్ సినిమా అయ్యేలా ప్లాన్ చేస్తున్నాను. ఇప్పటివరకు నేను రాసుకున్న స్క్రిప్ట్ లో ఇదే అత్యుత్తమమైనది. ప్రేక్షకులు ఊహించని స్థాయిలో ఈ సీక్వెల్ ఉంటుంది" అని నీల్ భరోసా ఇచ్చారు. అంటే పార్ట్-1 కేవలం శాంపిల్ మాత్రమేనని, అసలు సిసలు యాక్షన్ పార్ట్-2లో ఉంటుందని ఆయన మాటలను బట్టి అర్థమవుతుంది. ఈ సినిమాలో ప ృథ్వీరాజ్ సుకుమారన్, శ ృతి హాసన్, జగపతి బాబు వంటి భారీ స్టార్ కాస్టింగ్ ఉండటంతో అంచనాలు ఆకాశాన్ని తాకుతున్నాయి. నిర్మాతలు సైలెంట్‌గా ఉన్నా, లోపల మాత్రం పని గట్టిగానే జరుగుతున్నట్లు తెలుస్తోంది.

## ప్రభాస్ – సుజీత్ – హెూంబాలే ఫిల్మ్స్.. ఫిక్స్?



పవర్ స్టార్ పవర్ కళ్యాణ్ హీరోగా వచ్చిన హిట్ సినిమా ఓజి తో ఇండస్ట్రీలో దర్శకుడు సుజీత్ పేరు మారుమోగింది. చాలా కాలంగా హిట్ లేని పవర్ స్టార్ కు హిట్ ఇచ్చాడు సుజీత్. దాంతో ఇప్పుడు ఈ యంగ్ డైరెక్టర్ కు వరుసగా భారీ ఆఫర్లు వస్తున్నాయి. ఇప్పటికే నేచురల్ స్టార్ నాని హీరోగా ఓ సినిమా చేస్తున్నాడు సుజిత్. అలానే పలు ప్రముఖ నిర్మాణ సంస్థల నుంచి సుజీత్ కు అడ్వాన్స్ లు వస్తున్నాయట.

లేటెస్ట్ అప్‌డేట్ ప్రకారం, కన్నడ ప్రముఖ పాన్ ఇండియా నిర్మాణ సంస్థ హెూంబాలే ఫిల్మ్స్ సుజీత్‌ను తమ బ్యానర్‌లో ఓ భారీ ప్రాజెక్ట్ కోసం లాక్ చేసినట్టు తెలుస్తోంది. ఈ సినిమా పాన్ ఇండియా స్థాయిలో  తెరకెక్కించేలా ప్లాన్ చేస్తున్నారట. అయితే ప్రభాస్ తో మరోసారి సినిమా చేసేందుకే సుజిత్ ను లాక్ చేశారని టాక్ నడుస్తోంది. ఈ ఇద్దరి కాంబోలో వచ్చిన సాహూ ఓ మోస్తారు సక్సెస్ అయినా కూడా సుజిత్ వర్క్ పట్ల ప్రభాస్ సూపర్ హ్యాపీ. రెబెల్ స్టార్ యాక్షన్ సస్టైలిస్ట్ గా సుజిత్ చాలా బాగా చుపించాడు.   ఇప్పుడు మరోసారి ప్రభాస్ తో సినిమా అంటే సుజిత్ ఇంకా గట్టిగా ప్లాన్ చేస్తానడంలో సందేహం లేదు. ప్రభాస్ తో తనకు యాక్షన్ కామెడీ సినిమా చేయాలనుందని గతంలో ఓ ఇంటర్వ్యూలో తెలిపాడు సుజిత్. అన్ని అనుకున్నట్టు జరిగి సుజీత్ – ప్రభాస్ కాంబోపై త్వరలోనే అఫీషయల్ ప్రకటన రాబోతుంది. ఈ సినిమాకు అనిరుద్ సంగీతం అందిస్తాడని కూడా ఓ టాక్ వినిపిస్తోంది.

## రష్మిక 'మైసా' గ్లింప్స్ డేట్ లాక్.. కొత్త అవతారంలో నేషనల్ క్రష్

నేషనల్ క్రష్ రష్మిక మందన్న ప్రస్తుతం కెరీర్ పరంగా పీక్ స్టేజ్‌లో ఉన్నారు. 'పుష్ప 2' బ్లాక్ బస్టర్ సక్సెస్ తర్వాత ఆమె నుంచి రాబోతున్న మరో భారీ యాక్షన్ థ్రిల్లర్ 'మైసా' . ఈ సినిమాపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. తాజాగా చిత్ర బ ృందం ఈ సినిమాకు సంబంధించిన ఒక క్రేజీ అప్‌డేట్‌ను సోషల్ మీడియా వేదికగా పంచుకుంది.

ఈ సినిమా ఫస్ట్ గ్లింప్స్‌ను డిసెంబర్ 24, 2025న విడుదల చేయబోతున్నట్లు అధికారికంగా ప్రకటించారు. ఈ సినిమా ద్వారా రవీంద్ర పూలే దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ఆయన గతంలో స్టార్ డైరెక్టర్ హను రాఘవపూడి వద్ద అసిస్టెంట్‌గా పనిచేశారు.'కల్కి 2898 ఏడి' ఫేమ్ అంతర్జాతీయ స్టంట్ మాస్టర్ ఆండీ లాంగ్ ఈ చిత్రానికి హై-వోల్టేజ్ యాక్షన్ సీక్వెన్స్‌లను డిజైన్ చేస్తున్నారు. జేక్స్ బిజోయ్ అదుతేమైన బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నారు. కాగా తాజాగా విడుదల చేసిన పోస్టర్ లో రష్మిక చాలా పవర్ ఫుల్ లుక్ లో కనిపించింది. ఇక కథ విషయానికి వస్తే.. సమాచారం ప్రకారం

తెలంగాణలోని ఆదిలాబాద్ జిల్లాలో నివసించే 'గోండు' తెగల నేపథ్యంలో ఈ సినిమా రూపొందుతోంది. హక్కుల కోసం పోరాడే ఒక వీరనారిగా, పవర్‌ఫుల్ మదర్ క్యారెక్టర్‌లో రష్మిక ఈ సినిమాలో కనిపించబోతున్నారు. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ లుక్ పోస్టర్ లో రష్మిక ముఖంపై రక్తపు మరకలతో, చేతిలో ఆయుధం పట్టుకుని చాలా ఇంటెన్స్‌గా కనిపించి అందరినీ ఆశ్చర్యపరిచారు. "ఆమె గర్జన వినడానికి కాదు.. భయపెట్టడానికి" అనే ట్యాగ్ లైన్ సినిమాలోని యాక్షన్ ఏ రేంజ్‌లో ఉండబోతుందో హింట్ ఇస్తోంది. మరి గ్లింప్స్ ఏ విధంగా ఆకట్టుకుంటుందో చూడాలి.

Printed and Published by Rayaparthi Bhanuprasad on be half Of Telugu galam
H.No: 1-6, Thammadapally-G, Guduru, PO: Thammadapalli 506316 , Jangoan , Telangana State,
Published at VARSHA PRUDHVI PUBLICATIONS & PRINTER GRAPHICS 3-63, Thanedharpalle, Ghanpur Station Mandal, Thanedharpalle 506143 Warangal ,Telangana State,
Rayaparthi Bhanuprasad TGTEL/25/A4366.